


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510


ప్రజలకు ఇచ్చిన మోసపు హామీలపై కూటమి సర్కార్‌ను నిలదీత..




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 299 పేజీలు - 08 వెల - 05/- సోమవారం 26-10-2026


# ఏపీకి 'అర్ణబ్' తుపాను ముప్పు



అధికారులను అప్రమత్తం చేసిన చంద్రబాబు

- అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 140 కి.మీ వేగంతో పెనుగాలులు
- భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన ప్రభుత్వం, రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు
- తుఫాను సన్నద్ధతపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష

**సహాయక చర్యలకు సర్కారు సన్నద్ధం**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపానుగా బలపడుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, సహాయక కార్యక్రమాలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, డీజీపీ హరీశ్ గుప్తా, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆర్టీజీ అధికారులతో పాటు వ్యవసాయ, విద్యుత్, ఇరిగేషన్, హోం, వైద్యారోగ్య, పౌరసరఫరాలు, పురపాలక, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, పక్కా ప్రణాళికతో ప్రజలకు

మిగతా 2లో

# టీజీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్..

**రూ.600కే హైదరాబాద్‌లో వారమంతా బస్సు ప్రయాణం!**

హైదరాబాద్ ప్రయాణికుల కోసం టీజీఎస్ఆర్టీసీ కొత్త వీక్లీ పాస్

రూ.600 చెల్లిస్తే వారం రోజుల పాటు అన్‌లిమిటెడ్ ప్రయాణం

ఏసీ బస్సులతో సహా అన్ని సిటీ బస్సుల్లోనూ ఈ పాస్ చెల్లుబాటు

ఎయిర్‌పోర్ట్ పుష్పక్ సర్వీసులకు మాత్రం మినహాయింపు

అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో ఈ పాస్ అందుబాటులో!




హైదరాబాద్ నగరంలో బస్సుల్లో ప్రయాణించే వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఒక శుభవార్త అందించింది. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్తగా అన్‌లిమిటెడ్ బస్ పాస్‌ను ప్రవేశపెట్టింది. కేవలం రూ.600 చెల్లించి ఈ పాస్‌ను పొందడం ద్వారా ఏడు రోజుల పాటు నగరంలో అపరిమితంగా ప్రయాణించవచ్చు. ఈ కొత్త పాస్ కొనుగోలు చేసిన తేదీ నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటులో ఉంటుంది.

మిగతాది 2లో

## భారత మహిళల జోరు.. జింబాబ్వేపై ఘన విజయం

భారీ లక్ష్య ఛేదనలో తడబడిన జింబాబ్వే

- జింబాబ్వేతో వన్డే సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకున్న భారత మహిళల జట్టు
- రెండో వన్డేలో 121 పరుగుల భారీ తేడాతో విజయం
- హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ అద్భుత సెంచరీలు
- 4 వికెట్లతో చెలరేగిన వైష్ణవి శర్మ, 3 వికెట్లు తీసిన దీప్తి



జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనను కొనసాగించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (126), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (106*) అద్భుత శతకాలతో చెలరేగడం, ఆ తర్వాత బౌలర్లు రాణించడంతో భారత్ 121 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది.

మిగతాది 2లో

## ఏపీకి అతి తీవ్ర తుపాను ముప్పు.. 8 జిల్లాల్లో హై అలర్ట్

- ఆంధ్రప్రదేశ్‌పైకి దూసుకొస్తున్న అతి తీవ్ర తుపాను
- అక్టోబర్ 28న విశాఖ-బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం
- బాపట్ల నుంచి విజయనగరం వరకు 8 జిల్లాలపై తీవ్ర ప్రభావం
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే సూచన
- ప్రభావిత ప్రాంతాల ప్రజల తరలింపునకు ప్రభుత్వ ఏర్పాట్లు



ఆంధ్రప్రదేశ్‌కు తుపాను గండం పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి, అతి తీవ్ర తుపానుగా మారి రాష్ట్రంపై పంజా విసరనుందని వాతావరణ సంస్థల నివేదికలు చెబుతున్నాయి. ఈ తుపానుకు 'అర్ణబ్' (సముద్రం) అని నామకరణం చేశారు. ప్రభావం ముఖ్యంగా బాపట్ల నుంచి విజయనగరం

మిగతాది 2లో



## ఎంతటి లక్ష్యమైనా భారత బలగాలను దాటిపోలేదు

- భారత బలగాలకు అందని లక్ష్యం లేదని ఎయిర్ చీఫ్ ఏపీ సింగ్ స్పష్టీకరణ
- 'ఆపరేషన్ సింధూర్'తో ఈ విషయం స్పష్టంగా నిరూపితమైందని వెల్లడి
- స్వదేశీ ఆయుధాల శక్తి ప్రపంచానికి తెలిసివచ్చిందని వ్యాఖ్య

భారత సాయుధ దళాలకు అందని లక్ష్యమంటూ ఏదీ లేదని, ఏ శత్రువైనా, ఏ ప్రాంతమైనా మన బలగాల పరిధిలోనే ఉందని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్పష్టం చేశారు.

## మాదాపూర్‌లో విషాద ఘటన..

● పెళ్లికి నిరాకరించడంతోనే బలవన్మరణం అంటున్న పోలీసులు ● ఆత్మహత్యకు ముందు ప్రియుడికి వీడియో కాల్ చేసిన యువతి ● ఉత్తరప్రదేశ్‌కు చెందిన అర్చనా చౌదరిగా గుర్తింపు ● కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న మాదాపూర్ పోలీసులు



హైదరాబాద్ నగరంలోని ఐటీ కారిడార్ మాదాపూర్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తన నివాసంలోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతురాలిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన అర్చనా చౌదరి మాలిక్‌గా పోలీసులు గుర్తించారు. పెళ్లికి ప్రియుడు నిరాకరించడంతోనే ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నారని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

మిగతాది 2లో

## "మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే"..

ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

మోదీ అధికారంలోంచి దిగరంటూ పాట్నా సభలో ఓ వ్యక్తి నినాదం

నినాదం చేసిన వ్యక్తిపై ఖర్గే ఆగ్రహం

ఖర్గే తీరుపై కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం

కాంగ్రెస్ నిరాశ, నిస్పృహల్లో ఉందని బీజేపీ నేతల విమర్శలు




## రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా మారారు

- రాహుల్ గాంధీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారిందన్న కేటీఆర్
- హామీలు గాలికొదిలి కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందని విమర్శ
- సీఎం రేవంత్ పాలనలో స్కామ్‌లు, అవినీతి పెరిగిపోయిందని ఆరోపణ
- 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేసిన కేటీఆర్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీకి ఒక ఏటీఎంగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వరుస కుంభకోణాలు, అవినీతి జరుగుతున్నా రాహుల్ గాంధీ మౌనంగా ఉండటానికి కారణం..

మిగతాది 2లో



## ఇప్పుడు స్థానిక ఎన్నికల పేరుమీద జరుగుతున్నది గ్యాంగ్ వార్ మాత్రమే: విజయసాయిరెడ్డి

- రెండు కుటుంబాలకు చెందిన గ్యాంగులు రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నాయన్న విజయసాయి
- అధికార పార్టీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు నామినేషన్లు చించేస్తున్నారని ఆరోపణ
- 2021 నాటి వైసీపీ అరాచకం కంటే పదింతల అరాచకం ఇప్పుడుందని విమర్శలు
- రాష్ట్ర అభివృద్ధికి మూడో రాజకీయ ప్రత్యామ్నాయమే పరిష్కారమని పునరుద్ఘాటన



ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో జరుగుతున్నది ఎన్నికలు కాదని,

# రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి ఏటీఎం కార్డులా మారారు

మౌనంగా ఉండటానికి కారణం.. ఇక్కడి నుంచి ఆయనకు ముడుపులు అందుతుండటమేనని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు జిబ్రాన్ షరీఫ్, తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.

**రాహుల్ మౌనం వెనుక మర్మమదే**

దేశమంతా తిరుగుతూ 'ఛాత్రోంకీ గూంజ్' అంటూ ఉపన్యాసాలిచ్చే రాహుల్ గాంధీకి తెలంగాణలో అడుగుపెట్టే ధైర్యం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు 420 హామీలిచ్చి, వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. "రాహుల్ గాంధీ అడ్రస్ లేకుండా పోయారు. తెలంగాణలో ఏం జరుగుతుందో ఆయనకు పట్టడం లేదు. ఎందుకంటే ఆయనకు అందాల్సినవి అందుతున్నాయి. అందుకే ఇక్కడి స్కామ్‌లపై, ప్రభుత్వ వైఫల్యాలపై నోరు మెదపడం లేదు" అని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో టీ స్టాల్ వద్ద కూర్చొని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల గురించి భరోసా ఇచ్చిన రాహుల్ గాంధీ, ఇప్పుడు వారిని పూర్తిగా విస్మరించారని అన్నారు. మైనారిటీల కోసం ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించి, సంక్షేమానికి రూ.4,000 కోట్లు కేటాయిస్తామన్న హామీని గాలికొదిలేశారని విమర్శించారు. ఆసరా పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని, రైతులకు ఎకరానికి రూ.15,000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు మాట తప్పారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిట్లతో, అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో వరుస కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయని, ముఖ్యంగా ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ వ్యవహారాలు అనుమానాస్పదంగా ఉన్నాయని అన్నారు. "సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ.7 కోట్లకే తన తమ్ముడికి కట్టబెట్టారు. అమెరికాలో ఉంటున్న మరో సోదరుడికి సంబంధించిన రూ.1,000 కోట్ల డీల్‌పై కూడా అనేక అనుమానాలు ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**2028లో కేసీఆరే మళ్లీ సీఎం**

ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన విభజనలు సృష్టిస్తుంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని కేటీఆర్ అన్నారు. దేశంలో ప్రధాని మోదీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు. "ఇంకో ఏడాదిన్నరలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. తెలంగాణను తిరిగి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం" అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## ఇప్పుడు స్థానిక ఎన్నికల పేరుమీద జరుగుతున్నది

# గ్యాంగ్ వార్ మాత్రమే: విజయసాయిరెడ్డి

తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో జరుగుతున్నది ఎన్నికలు కాదని, కేవలం గ్యాంగ్ వార్ మాత్రమేనని ఆయన ధ్వజమెత్తారు. రెండు కుటుంబాలకు చెందిన గ్యాంగులు రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల పేరుమీద జరుగుతున్నది గ్యాంగ్ వార్ మాత్రమే. బీహార్‌ను మించి పోయి, రెండు కుటుంబాలకు చెందిన ఒక హిందూ కుల గ్యాంగ్, మరో మైనారిటీ మతానికి చెందిన గ్యాంగ్‌లు మన రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్నాయి" అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు కుటుంబ గ్యాంగులకు అధికారం దక్కకుండా చేస్తే తప్ప ఏపీలో ప్రజలకు రక్షణ ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రానికి అభివృద్ధి కేవలం మూడవ ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ వలనే సాధ్యమవుతుందని, అదే ఏపీకి శరణ్యమని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "అధికార పార్టీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు.. ఈ ముగ్గురు కలిసి ఒక కూటమిగా ఏర్పడి, స్థానిక ఎన్నికల్లో పోటీపడి నామినేషన్లు చించేస్తున్నారు" అని విమర్శించారు. 2021లో వైసీపీ చేసిన అరాచకం కంటే పదింతలు ఎక్కువ అరాచకం ఈ రోజు స్థానిక సంస్థల ఎన్నికల్లో కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు.

# ఏపీ వైపు దూసుకొస్తున్న 'అర్ణబ్'.. అధికారులను అప్రమత్తం చేసిన చంద్రబాబు

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ప్రస్తుతం విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా 850 కిలోమీటర్లు, కాకినాడకు 930 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్న వాయుగుండం వేగంగా బలపడుతోంది. ఇది అక్టోబర్ 26 ఉదయానికి తుపానుగా, అదే రోజు రాత్రికి తీవ్ర తుపానుగా, 27వ తేదీ నాటికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అక్టోబర్ 28న ఉదయం నుంచి మధ్యాహ్నం లోగా బాపట్ల--విశాఖపట్నం మధ్య తీరం దాటవచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రస్తుత అంచనాల ప్రకారం కోనసీమ--యానాం--కాకినాడ తీర ప్రాంతంలో తీరం దాటే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, కొన్ని సందర్భాల్లో గాలి వేగం గంటకు 140 కిలోమీటర్ల వరకు చేరవచ్చని హెచ్చరించారు.

భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు

తుఫాను ప్రభావంతో అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలపై గాలులు, వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేశారు. అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా సగటున 292.55 మి.మీ., అల్లూరి సీతారామరాజు జిల్లాలో 281.17 మి.మీ., విశాఖపట్నంలో 253.87 మి.మీ., శ్రీకాకుళంలో 249.18 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజుల సగటు వర్షపాతం 95 మి.మీ.గా ఉంటుందని అంచనా వేశారు.

**చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష**

సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల బోట్లన్నీ వెంటనే తీరానికి తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సహాయక చర్యల కోసం రాష్ట్రంలో 10 ఎన్‌డీఆర్ఎఫ్, 11 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన సామగ్రితో బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. భారీ వర్షాల వల్ల వచ్చే వరద నీటిని రిజర్వాయర్లలోకి మళ్లించి, నీటిని నిల్వ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తుపాను తీవ్రత దృష్ట్యా ప్రజలు, అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటున్నందున ఎవరూ వేటకు వెళ్లవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

## భారత మహిళల జోరు.. జింబాబ్వేపై ఘన విజయం

ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (106లి) అద్భుత శతకాలతో చెలరేగడం, ఆ తర్వాత బౌలర్లు రాణించడంతో భారత్ 121 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో కైవసం చేసుకుంది. వడోదర వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ స్మృతి మంధాన (0), షఫాలీ వర్మ (8) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 19 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ప్రతీక రావల్ (61)తో కలిసి హర్మన్‌ప్రీత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. ఆ తర్వాత దీప్తి శర్మ జత కలవడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మలు జింబాబ్వే బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి శతకాలతో కదం తొక్కారు. దీంతో భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. 329 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వేకు మంచి ఆరంభమే లభించింది. 20 ఓవర్లు ముగిసేసరికి ఒక వికెట్ నష్టానికి 104 పరుగులు చేసి పోరాడే సంకేతాలు ఇచ్చింది. ముపచిక్వా (49), తిరిపానో (46) రాణించారు. అయితే, ఆ తర్వాత భారత స్పిన్నర్లు విజృంభించారు. స్పిన్ త్రయం వైష్ణవి శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి ధాటికి జింబాబ్వే బ్యాటర్లు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయారు. వైష్ణవి శర్మ 4 వికెట్లతో చెలరేగగా, బ్యాటింగ్‌లో సెంచరీతో మెరిసిన దీప్తి శర్మ బౌలింగ్‌లోనూ 3 వికెట్లు పడగొట్టి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. దీంతో జింబాబ్వే జట్టు 48.5 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌట్ అయింది.

## ఎంతటి లక్ష్యమైనా భారత బలగాలను దాటిపోలేదు

ఉందని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్పష్టం చేశారు. గతేడాది పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' ఈ విషయాన్ని ప్రపంచానికి స్పష్టంగా నిరూపించిందని ఆయన అన్నారు. అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో పీటీఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఆపరేషన్‌తో భారత వాయుసేన (×ూఖీ) వ్యూహాత్మకంగా ముందడుగు వేసి, ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ తీసిందని ఆయన వివరించారు.

గతేడాది మే నెలలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టామని ఏపీ సింగ్ గుర్తుచేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 1,200 కిలోమీటర్ల వెడల్పు, 200 కిలోమీటర్ల లోతు వరకు విస్తరించి ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై నిర్దిష్ట దాడులు చేశామని తెలిపారు. ఈ దాడుల ద్వారా ఏ ప్రదేశమైనా ఐఏఎఫ్ పరిధికి అతీతం కాదని తేల్చిచెప్పినట్లు అయిందన్నారు. ఆపరేషన్‌లో ఒక్క సామాన్య పౌరుడికి కూడా హాని కలగకుండా 'జీరో కొలేటరల్ డ్యామేజ్' సూత్రాన్ని కచ్చితంగా పాటించామని ఆయన గర్వంగా చెప్పారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడం వెనుక కేవలం ఒక ఆయుధం లేదా ఒక విమానం మాత్రమే లేదని, కచ్చితమైన ఇంటెలిజెన్స్, నెట్‌వర్క్డ్ ఆపరేషన్స్, స్టాండ్-ఆఫ్ ఆయుధాలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, బహుళ-స్థాయి గగనతల రక్షణ వ్యవస్థల సమన్వయం ఉందని ఏపీ సింగ్ విశ్లేషించారు. ముఖ్యంగా, పాకిస్థాన్ సైన్యం ప్రయోగించిన డ్రోన్లు, ఇతర ఆయుధాలను మన స్వదేశీ గగనతల రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా ఎదుర్కొందని అన్నారు. ఈ ఆపరేషన్‌లో కొన్ని స్వదేశీ ఆయుధ వ్యవస్థలు అద్భుతంగా పనిచేసి, శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి పెను నష్టాన్ని కలిగించాయని తెలిపారు. స్వదేశీ ఉత్పత్తి రక్షణ రంగాన్ని ఆధునికీకరించడమే కాకుండా, భారతదేశ వ్యూహాత్మక స్వావలంబనను బలోపేతం చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుత ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారతదేశ సామర్థ్యాలను ప్రదర్శించడం జాతీయ భద్రతకు చాలా కీలకమని ఎయిర్ చీఫ్ మార్షల్ అభిప్రాయపడ్డారు. ఆ వనరులు అధికంగా ఉండే ప్రాంతంలో చైనా సైనిక విస్తరణపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన పెరుగుతోందని, ఈ నేపథ్యంలో భారత వాయుసేన పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని చెప్పారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడటానికి క్వాడ్ భాగస్వాములైన అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కలిసి భారత్ పనిచేస్తోందని తెలిపారు. ఇటీవల ఆస్ట్రేలియా, మలేషియా, థాయ్‌లాండ్‌లలో ఐఏఎఫ్ జరిపిన విన్యాసాలు సుదూర, సముద్ర గగనతల కార్యకలాపాలలో అమూల్యమైన అనుభవాన్ని అందించాయని ఆయన వివరించారు.

'వికసిత భారత్ 2047' జాతీయ దార్శనికతకు అనుగుణంగా ఐఏఎఫ్ దీర్ఘకాలిక ప్రణాళికలు ఉన్నాయని ఏపీ సింగ్ తెలిపారు. 2047 నాటికి భారత వాయుసేనను ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన, వినూత్నమైన, సాంకేతికంగా స్వావలంబన కలిగిన బహుళ-డొమైన్ ఏరోస్పేస్ శక్తిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశానికి రక్షణ, భద్రత పునాదులని, ఆ లక్ష్య సాధనలో ఐఏఎఫ్ తన పూర్తి పాత్రను పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# టీజీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్..

## రూ.600కే హైదరాబాద్‌లో వారమంతా బస్సు ప్రయాణం!

(మొదటి పేజీ తరువాయి)

తేదీ నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటులో ఉంటుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో తిరిగే ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బస్సులతో పాటు ఏసీ బస్సుల్లోనూ ఈ పాస్‌తో ప్రయాణించేందుకు అనుమతి ఉంటుందని టీజీఎస్ఆర్టీసీ స్పష్టం చేసింది. అయితే, శంషాబాద్ విమానాశ్రయానికి నడిచే పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తించదని అధికారులు తెలిపారు. ప్రయాణికులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు, బస్సు ప్రయాణాన్ని మరింత సులభతరం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ అధికారులు వివరించారు. ఈ కొత్త పాస్‌లు నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు. తరచూ బస్సుల్లో ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఈ పాస్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

# మాదాపూర్‌లో విషాద ఘటన..

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మాదాపూర్‌లోని చంద్రానాయక్ తండా, ఎస్ఆర్ సద్గురు రెసిడెన్సీలో అర్చన నివాసం ఉంటున్నారు. ఆమె స్థానికంగా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. అర్చనకు ఉత్తరాఖండ్‌కు చెందిన భండారీ విమల్‌తో గత నాలుగేళ్లుగా ప్రేమ వ్యవహారం ఉంది. అయితే, విమల్‌కు అప్పటికే వివాహం కాగా, భార్యతో విడాకుల ప్రక్రియ నడుస్తోంది. ఈ నేపథ్యంలో పెళ్లి చేసుకోవాలని అర్చన, విమల్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో, విమల్ తన తల్లితో కలిసి చేర్యాలలో ఓ కార్యక్రమానికి వెళ్లినప్పుడు అర్చన అతనికి వీడియో కాల్ చేసింది. తన గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుంటున్నట్లు చూపిస్తూ, తనను పెళ్లి చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన విమల్ ఆమెకు పలుమార్లు ఫోన్ చేసినా స్పందన రాలేదు. వెంటనే హుటాహుటిన ఆమె ఫ్లాట్‌కు చేరుకున్నాడు. అయితే, లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో తలుపులు తెరుచుకోలేదు. వెంటనే విమల్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న మాదాపూర్ పోలీసులు తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించగా, అప్పటికే అర్చన ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆధారాలు సేకరించింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు నేతృత్వంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. విమల్‌ను విచారించి మరిన్ని వివరాలు సేకరిస్తామని పోలీసులు తెలిపారు.

## ఏపీకి అతి తీవ్ర తుపాను ముప్పు.. 8 జిల్లాల్లో హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఈ తుపానుకు 'అర్ణబ్' (సముద్రం) అని నామకరణం చేశారు. ప్రభావం ముఖ్యంగా బాపట్ల నుంచి విజయనగరం వరకు ఉన్న 8 తీరప్రాంత జిల్లాలపై అధికంగా ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ూూాణవీూ) హెచ్చరించింది. అక్టోబర్ 28న మధ్యాహ్నం సమయంలో విశాఖపట్నం-బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై సహాయక చర్యలకు సిద్ధమైంది. ఈ తుపాను గత ఏడాది వచ్చిన 'మొంథా' తుపాను కంటే తీవ్రంగా ఉండొచ్చని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఫోన్‌లో 'ది హిందూ'తో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 12 రాష్ట్ర విపత్తుల స్పందన దళం (ాణ=ఖీ), 7 జాతీయ విపత్తుల స్పందన దళం (చీణ=ఖీ) బృందాలు ఉన్నాయని, ముందుజాగ్రత్త చర్యగా మరో మూడు చీణ=ఖీ బెటాలియన్లను కేంద్రం నుంచి అభ్యర్థించినట్లు వివరించారు. తుపాను తీవ్రతకు పాత కచ్చా ఇళ్లు, చెట్లు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని, పక్కా ఇళ్లకు కూడా స్వల్ప నష్టం వాటిల్లవచ్చని ఆయన అంచనా వేశారు. బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అక్టోబర్ 27వ తేదీలోగా సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ పునరావాస కేంద్రాలలో పారిశుద్ధ్యం, నిత్యావసర సరుకుల నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలపై తుపాను ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం మధ్యాహ్నానికే తూర్పు మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది సోమవారం తెల్లవారుజామున తుపానుగా, మంగళవారానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (×వీణ) తెలిపింది. సోమవారం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురవొచ్చని, మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 40 మిల్లీమీటర్ల లోపు మోస్తరు వర్షపాతం నమోదైంది. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం, 1971 నుంచి 2026 మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని 61 తుపానులు తాకగా, వాటిలో హుద్‌హుద్‌తో సహా 10 తుపానులను 'అతి తీవ్ర తుపానులు'గా వర్గీకరించారు. ఈ కేటగిరీలో చివరిసారిగా 2018లో 'తిత్లీ' తుపాను పలాస సమీపంలో తీరం దాటింది. ఇప్పటికే విశాఖ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. ప్రజలకు సహాయం కోసం 112, 1070, 1800 425 0101 టోల్ ఫ్రీ నంబర్లను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

# "మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే"..

ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన తీవ్ర వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారితీశాయి. బీహార్ రాజధాని పాట్నాలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ తండ్రిని ప్రస్తావిస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్రనేతలు ఖర్గే తీరును తీవ్రంగా ఖండించారు. బీహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీకృష్ణ సింగ్ 139వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సభలో ఖర్గే ప్రసంగిస్తుండగా, ప్రేక్షకుల మధ్యలో ఉన్న సంతోష్ సింగ్ అనే వ్యక్తి "మోదీ నహీ జాయేగా" (మోదీ అధికారంలోంచి దిగరు) అని గట్టిగా అరిచాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఖర్గే, "మోదీ కా బాప్ భీ జాయేగా" (మోదీ ఏంటి.. మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ మూడుసార్లు వ్యాఖ్యానించారు. ఆ వెంటనే కాంగ్రెస్ కార్యకర్తలు సంతోష్ సింగ్ ను చుట్టుముట్టి, చితకబాది సభా ప్రాంగణం నుంచి బయటకు పంపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివాదం ముదిరింది. ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా స్పందించారు. "ప్రధాని మోదీపై, ఆయన తండ్రిపై దూషణలకు దిగుతూ కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు హుందాతనాన్ని కోల్పోతోంది. వరుస ఓటములతో నిరాశ, నిస్పృహల్లో ఉన్న కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతోంది" అని విమర్శించారు. గతంలో మోదీ తల్లిని, ఆయన పేదరికాన్ని అవమానించారని గుర్తుచేశారు. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా కూడా ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. "ప్రధాని మోదీకి దేశవిదేశాల్లో పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్ నేతలు ద్వేషపూరిత రాజకీయాలు చేస్తున్నారు. 140 కోట్ల మంది ప్రజలు ఎన్నుకున్న ప్రధానిని, ఆయన కుటుంబాన్ని అవమానించడం అంటే దేశ ప్రజలను అవమానించడమే" అని అన్నారు. బీజేపీ నేతలు తుహిన్ సిన్హా, గిరిరాజ్ సింగ్, నితిన్ నబిన్ తదితరులు కూడా ఖర్గే వ్యాఖ్యలను తప్పుబట్టారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై చర్చించే అంశాలు లేనప్పుడే ప్రతిపక్షాలు ఇలా వ్యక్తిగత దాడులకు దిగుతాయని, ప్రజలు దీనిని గమనిస్తున్నారని, తగిన సమయంలో సమాధానం చెబుతారని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

## నిత్య అన్నదానానికి రూ.45 వేల విరాళం



పాణ్యం అక్టోబర్ 25 పల్లె వెలుగు : మండలంలోని ఎస్ కొత్తూరు గ్రామంలో వెలసిన ప్రముఖ శైవ క్షేత్రం శ్రీవల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానముకు నిత్య అన్నదాన కార్యక్రమానికి ఆదివారం రెండు కుటుంబాలు మొత్తం రూ.45 వేల విరాళం అందజేశాయి. హైదరాబాద్‌కు చెందిన సతికెల రమణయ్య, తులశమ్మ కుటుంబ సభ్యులు రూ.20 వేలు, నంద్యాలకు చెందిన ఆలమూరు కార్తీక్, పుష్పలత కుటుంబ సభ్యులు రూ.25 వేలు విరాళంగా అందించినట్లు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు.నిత్య అన్నదానానికి సహకరించిన దాతలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## 51వ వార్డులో ఎన్నికలు యథాతథం.

### ఏకగ్రీవ ఎన్నిక రద్దు చేసిన ఎన్నికల అధికారి మోహన్‌రావు.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల స్థానిక మున్సిపాలిటీలోని 51వ వార్డులో ఏకగ్రీవ ఎన్నికను రద్దు చేసినట్లు ఎన్నికల అధికారి మోహన్‌రావు తెలిపారు. అభ్యర్థి సమర్పించిన పత్రాలు నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో ఏకగ్రీవంగా ప్రకటించిన నిర్ణయాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో 51వ వార్డులో ఎన్నికలు యథావిధిగా నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

## వృద్ధ మహిళలకు, వితంతు మహిళలకు చీరలు పంపిణీ






నంద్యాల ప్రతినిధి. అక్టోబర్ 25. (పల్లె వెలుగు ):భాను స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు లయన్ ధనాల రవికాంత్ బాబు ఆధ్వర్యంలో డాక్టర్ పి. గురురాజా ఎండీ జన్మదిన సందర్భంగా ఆదివారం వృద్ధ మహిళలకు, వితంతు మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.భాను స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు లయన్ ధనాల రవికాంత్ బాబు మాట్లాడుతూ పేదల పెన్నిధి కులమతాలకు అతీతంగా సహాయం చేస్తున్న మా గురువు డాక్టర్ పి. గురురాజా భగవంతుడు మా గురువుకి మంచి ఆరోగ్యం బలం ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను అలాగే రాజకీయంగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దనాల గంగరాజుకి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సభ్యులు నా సతీమణి దనాల సుమ, నా కూతురు దనాల శ్వేత, వసుంధర, డానియల్, సునీత మున్నీ తదితరులు పాల్గొన్నారు.ఐ

## శ్రీ చౌడేశ్వరి దేవస్థానానికి రూ 5 లక్షల విరాళం



బనగానపల్లె, అక్టోబర్ 25, పల్లెవెలుగు మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానానికి హైదరాబాద్ జిల్లా బాలాజీ నగర్ లోని యాపరాల్ కు చెందిన సత్తికేల రమణయ్య, ఆయన సతీమణి తులశమ్మ, వారి కుమారుడు వెంకట శ్రావణ కుమార్, కోడలు నందిని, మనుమడు మధు శ్రీయాన్ లు ఆలయ అభివృద్ధి కొరకు 5,00,000/- ల విరాళాన్ని ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి ల సమక్షంలో ఆలయ అర్చకులకు ఆదివారం అందచేశారు

### 4వ వార్డులో వైసీపీ అభ్యర్థి పురందర్ కుమార్

# ఇంటింటి సుడిగాలి ప్రచారం.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని 4వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురందర్ కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. వార్డులోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక ఓటర్లను కలుసుకుని, ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

వార్డు సమస్యలపై ప్రస్తావన.

ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న పురందర్ కుమార్, వార్డులోని మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, విద్యుత్ సమస్యలు వంటి అంశాలు వార్డు అభివృద్ధిలో ప్రాధాన్యత కలిగినవని పేర్కొన్నారు. గతంలో కంటే మెరుగైన సేవలు అందిస్తానని వెల్లడి. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి (రవి అన్న) ఆశీస్సులతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పురందర్ కుమార్ తెలిపారు. తనకు అవకాశం కల్పిస్తే గతంలో కంటే మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, స్థానిక సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం, తన ప్రాధాన్యతలని వెల్లడించారు.

అభివృద్ధి అంశాలపై దృష్టి

4వ వార్డులో మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాల కోసం కృషి చేస్తానని పురందర్ కుమార్ తెలిపారు. ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని, వైసీపీ ఎన్నికల గుర్తు అయిన ఫ్యాన్‌కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో వార్డు అభివృద్ధి,

స్థానిక సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాలనుకుంటున్న కార్యక్రమాలు ప్రధాన అంశాలుగా ప్రస్తావనకు వస్తున్నాయి.

## ప్రజలకు ఇచ్చిన మోసపు హామీలపై కూటమి సర్కార్‌ను నిలదీత..

### త్వరలోనే ప్రజా ఆగ్రహం చవిచూడక తప్పదన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. స్థానిక ఎన్నికలు వస్తేనే ప్రజలు గుర్తుకొస్తారా?! మాయమాటలతో మరోసారి ప్రజలను మోసం చేయడానికి కుట్రలు పన్నుతున్నారా? అవును ఇదో రాజకీయ ప్రకటన కాదు, ప్రజల గొంతుక చంద్రబాబు నాయుడు పాలనపై, ఆయన మోసపూరిత వైఖరిపై వైయస్సార్‌సీపీ శ్రేణులు సంధిస్తున్న తీవ్రమైన అగ్గిలాంటి ప్రశ్న ఇది! నంద్యాల పురపాలిక పోరు రోజురోజుకూ రసవత్తరంగా మారుతున్న వేళ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ భాష, ఎస్ డి పి ఐ నాయకులు డేనియల్ పురం, సరస్వతి నగర్ సుద్దల పేటలో ప్రచార పర్వంలో అధికార పార్టీ వైఖరిపై నిప్పులు చెరిగారు. పట్టణ అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి హోరెత్తించిన ఆయన, కూటమి నేతల అవినీతి, అరాచకాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని, నేడు కూటమి నాయకులు సాగిస్తున్న దుర్మార్గపు పాలనను ఏకిపారేశారు. నంద్యాల మున్సిపాలిటీని మళ్లీ ప్రగతి పథంలో నడిపించాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల మోసాలపై కూటమి సర్కార్‌ను శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నిలదీశారు.

త్వరలోనే ప్రజా ఆగ్రహం చవిచూడక తప్పదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని కీలక వార్డులలో ఆయన పర్యటించారు. చైర్మన్ అభ్యర్థి అమీర్ బాషాతో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 42వ వైసీపీ అభ్యర్థి షేక్ శంషాద్, 43 వ వార్డు వైసిపి అభ్యర్థి ఎం. లక్ష్మీదేవి, 15వ వార్డు వైసిపి అభ్యర్థి బైసాని రమేష్ బాబు, 16వ వార్డు వైసిపి అభ్యర్థి షేక్ ముంతాజ్ బేగం, వీరందరితో పాటు చైర్మన్ అభ్యర్థి అమీర్ బాషాను 'ఫ్యాన్' గుర్తుపై భారీ ఓట్లతో గెలిపించాలని నంద్యాలలో జోరుగా ప్రచారం నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి మాట్లాడుతూ నాడు కరోనా కష్టకాలంలో ప్రజల ప్రాణాలు గాల్లో దీపంలా ఉంటే అప్పుడు వారిని కాపాడుకుంటూ, సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించిన ఘనత ఒక్క వైయస్సార్‌సీపీ ప్రభుత్వానిదే కానీ నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఒక్క కొత్త పింఛను కూడా ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో కూరుకుపోయిందని విమర్శించారు పేదవాడికి కొండంత భరోసాగా నిలిచిన 'ఆరోగ్యశ్రీ' పథకాన్ని నేడు అటకెక్కించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలతో చెలగాటమాడుతున్న తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకు, కేవలం రాజకీయ లబ్ధి కోసం కులమతాల మధ్య చిచ్చులు పెట్టడమే ఈ ప్రభుత్వ నైజం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా పవిత్రమైన తిరుపతి లడ్డు ప్రసాదంపై కూడా అబద్ధపు ప్రచారాలు సృష్టించి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిన నీచమైన రాజకీయాలు చంద్రబాబుకే చెల్లాయన్నారు. "కష్టకాలంలో ప్రజలను ఆదుకున్న చరిత్ర వైయస్సార్‌సీపీది అయితే అధికారం కోసం అబద్ధాలు, కుట్రలు, కులాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలు చంద్రబాబువి ప్రజల నెత్తిపై మోసాల భారం మోపుతున్న ఈ దౌర్భాగ్యపు పాలనకు ప్రజలే తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

# సైకిల్ జోరు.. ప్రచార హోరు.

- 43వ వార్డులో వెంకట లక్ష్మి ఇంటింటి ప్రచారం ముమ్మరం.
- కూటమి సంక్షేమ పథకాలే గెలుపు గుర్రాలు.
- 30 ఏళ్ల తర్వాత బీసీలకు దక్కిన గుర్తింపు.. టీడీపీకే మా ఓటు అంటున్న వార్డు ప్రజలు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పురపాలక సంఘం 43వ వార్డు ఎన్నికల సమరంలో తెలుగుదేశం పార్టీ విజయదుందుభి మోగించేందుకు దూసుకుపోతోంది. టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి డి. వెంకట లక్ష్మి, చైర్మన్ అభ్యర్థి డా. బాబన్ గెలుపే ఏకైక లక్ష్యంగా వార్డులో చేపట్టిన ఎన్నికల ప్రచారం సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. శ్రేణుల కేరింతలు, స్థానికుల అపూర్వ ఆదరణ నడుమ ప్రచారం జోరుగా సాగింది.

వార్డు ఇన్‌చార్జ్ డి. మారుతి (ప్రసాద్ బాబు) సమన్వయంతో అభ్యర్థి డి. వెంకట లక్ష్మి నాయకులతో కలిసి ప్రతి గడపనూ సందర్శించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ, సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

బీసీలకు సముచిత న్యాయం చేసింది టీడీపీయే:

ఈ సందర్భంగా అభ్యర్థి డి. వెంకట లక్ష్మి మాట్లాడుతూ.. "గత 30 ఏళ్లుగా ఈ వార్డులో ఏ రాజకీయ పార్టీ కూడా బీసీలను గుర్తించి అవకాశం ఇవ్వలేదు. కానీ, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసే తెలుగుదేశం పార్టీ నన్ను గుర్తించి కౌన్సిలర్ అభ్యర్థిగా నిలబెట్టింది. ప్రజా సంక్షేమం, వార్డు సర్వతోముఖాభివృద్ధే నా ధ్యేయం. మీ అమూల్యమైన ఓటుతో ఆశీర్వదించండి" అని పిలుపునిచ్చారు. స్థానిక మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మార్గదర్శకత్వంలో వార్డులో తాగునీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.





కదం తొక్కిన పార్టీ శ్రేణులు:

ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు జిల్లెళ్ల శ్రీరాములు, నగర డోనా సుధీర్, సద్దాం, వాసు, ఖలీల్, శేఖర్ రెడ్డి, సునీల్ కుమార్, చంటి, శివశంకర్, శ్రీనివాసులు, పుల్లయ్య, దాసు, నూర్ భాష తమిళ్లు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నవంబరు 1న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, వెంకట లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని శ్రేణులు ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో మహిళలు, స్థానికులు హారతులు పడుతూ పూర్తి మద్దతు ప్రకటించారు.

### అభివృద్ధి, సేవా దృక్పథం ఉన్న వారికే ఓటర్ల

# మద్దతు మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**ప్రత్యర్థి నేతలు ఈస్ట్ ఇండియా కంపెనీ లాంటివారు. వచ్చి పబ్బం గడుపుకొని వెళ్లిపోతారు. ఖండే శ్యామ్ సుందర్ లాల్ ఫైర్. సంతకు వచ్చి పోయే ఈస్ట్ ఇండియా కంపెనీ తరహా పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పండి. ఖండే శ్యామ్ సుందర్ లాల్ పిలుపు.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు బాలాజీ కాంప్లెక్స్ వద్ద తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఖండే శ్యామ్ సుందర్ లాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏపీ న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్, యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, ఎన్ఎండి ఫిరోజ్, నంద్యాల బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నంద్యాల పట్టణ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు . గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశామని తెలిపారు . ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేసే అభ్యర్థులనే ప్రజలు ఆదరించాలని, 13వ వార్డు టీడీపీ అభ్యర్థి ఖండే శ్యామ్ సుందర్ లాల్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్, ఇతర కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆయన వార్డు ప్రజలను కోరారు.

ఈ సందర్భంగా 13వ వార్డు టీడీపీ అభ్యర్థి ఖండే శ్యామ్ సుందర్ లాల్ మాట్లాడుతూ గతంలో నిధులు ఇవ్వకపోయినా కౌన్సిల్‌లో పోరాడి సుమారు రూ. 1.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులను వార్డులో చేపట్టామని తెలిపారు. మంత్రి ఫరూక్ సహకారంతో మరో రూ. కోటి అభివృద్ధి పనులకు ఆమోదం లభించిందని తెలిపారు . గత 15 ఏళ్లుగా ఉచిత వైద్య శిబిరాలు, కంటి అద్దాల పంపిణీ, దివ్యాంగులకు అవయవాల అమరిక, పేదల వివాహాలకు సాయం వంటి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నామని గుర్తుచేశారు. 15వ వార్డు కూటమి అభ్యర్థి వేణు, తాను ప్రజాసేవలోనే ఉంటామని, కరోనా కష్టకాలంలో నిత్యావసర సరుకులు, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులకు భోజనాలు అందించిన ఘనత తమదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అడ్డదారులు తొక్కుతూ, స్థానికేతరులను బరిలోకి దించుతూ ప్రత్యర్థులు ఆడుతున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. వ్యాపారాలు, స్వార్థ రాజకీయాల కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం పనిచేసే వారినే ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. ఆర్యవైశ్య సంఘం మరియు ఆర్యవైశ్యులంతా అభివృద్ధికి, నిబద్ధతకు అండగా ఉంటూ తమకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని తెలిపారు. నంద్యాలలోని 52 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు కానుకగా అందిస్తామని అన్నారు .

ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి బింగుమళ్ళ శ్యామ్ సుందర్ గుప్త, ఆనంద్ గురూజీ, మహానందీశ్వర స్వామి దేవస్థానం చైర్మెన్ బోయ రామకృష్ణ, కాళికాంబ దేవస్థానం చైర్మెన్ బింగుమళ్ళ సుబ్బలక్ష్మయ్య, 15వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి పబ్బతి వేణుగోపాల్, జిల్లెల్ల శ్రీరాములు , డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ అధ్యక్షుడు దుద్దెల సురేష్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ, సెగు శ్రీనివాసులు, ఉప్పరి సురేష్ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద ఆర్యవైశ్యులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

- **అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**
- **ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల విధులపై అవగాహన**
- **బ్యాలెట్ బాక్స్ నిర్వహణపై ప్రాయోగిక ప్రదర్శన**



పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్) నందు అధికారులకు పోలింగ్ ప్రక్రియ, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, ఎన్నికల సామగ్రి వినియోగం, పోలింగ్ సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్స్ నిర్వహణపై ప్రాయోగిక ప్రదర్శన నిర్వహించి, వివిధ దశల్లో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని, పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభానికి ముందు బ్యాలెట్ బాక్స్ ఖాళీగా ఉందో లేదో అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో చూపించి, నిబంధనల ప్రకారం సీల్ చేయాలని తెలిపారు. పోలింగ్ సమయంలో ఓటర్ల గుర్తింపు, బ్యాలెట్ పత్రాల జారీ, ఓటు వేసే విధానం వంటి అంశాల్లో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రిని సక్రమంగా వినియోగించడం, ఓటర్లకు అవసరమైన సూచనలు అందించడం, పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడటం అధికారుల ముఖ్యమైన బాధ్యతలని పేర్కొన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం సీల్ చేసి, కౌంటింగ్ కేంద్రం వద్ద సంబంధిత అధికారులకు అప్పగించే వరకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల విధులకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని, ఎన్నికల సంఘం హ్యాండ్‌బుక్‌లోని మార్గదర్శకాలను అనుసరించాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించేందుకు అక్టోబర్ 27న కర్నూలులోని దామోదరం సంజీవయ్య మెమోరియల్ పాఠశాలలో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. కర్నూలు నగరపాలక సంస్థ ఓటరు జాబితాలో పేరుండి, ఎన్నికల విధులు నిర్వహించే అర్హులైన సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు నిర్దేశించిన నిబంధనలను పాటించాలని తెలిపారు. ఇందుకోసం సంబంధిత ఓటరు వివరాలు, ఎన్నికల విధులకు సంబంధించిన నియామక ఉత్తర్వులతో హాజరుకావాలని చల్లా ఓబులేసు సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జునైద్, కార్యదర్శి నాగరాజు, సూపరింటెండెంట్లు ఇశ్రాయేలు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కోరుకొండ, రాజానగరం కూటమి ఎంపీపీ, జడ్పీటీసీ అభ్యర్థుల ప్రకటన



కోరుకొండ, అక్టోబర్ 25 స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కోరుకొండ, రాజానగరం మండలాల ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్డీఏ కూటమి అభ్యర్థులను నాయకులు అధికారికంగా ప్రకటించారు. బూరుగుపూడిలోని ద్వారకామాయి ఫంక్షన్ హాల్ వేదికగా నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, బీజేపీ సీనియర్ నాయకులు ఏపీఆర్ చౌదరి ఉమ్మడిగా అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. కూటమి బలమైన ప్రజాదరణ కలిగిన అభ్యర్థులను బరిలో దించడంతో వైఎస్సార్సీపీ పోటీ నుంచి తప్పుకునే పరిస్థితి నెలకొందని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల శ్రేణులు క్షేత్రస్థాయిలో పూర్తి సమన్వయంతో, ఐకమత్యంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం, మండల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రతి కార్యకర్త శ్రమించాలని సూచించారు. వందకు వంద శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి చారిత్రాత్మక విజయం సాధించాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కూటమి అభ్యర్థుల గెలుపుతో కోరుకొండ మండలాన్ని అభివృద్ధిలో ముందుంచుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత సార్వత్రిక ఎన్నికల స్ఫూర్తితో కోరుకొండ మండలంలో కూటమి సంపూర్ణ విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు కోరారు. సుపరిపాలన దిశగా మరో ఘనవిజయానికి నాంది పలకాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల

### సందర్భంగా ఆదివారం కర్నూలులో 10ఖ రన్ నిర్వహణ

**జెండా ఊపి 10 కె రన్ ను ప్రారంభించిన అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా**

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ




కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆదివారం కర్నూలులో 10ఖ రన్ నిర్వహించారు. కర్నూలు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం నుంచి ప్రారంభమైన ఈ 10ఖ రన్ రాగమయూరి టెంపుల్, కరెంట్ ఆఫీస్ మీదుగా సాగి తిరిగి కర్నూలు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం కు చేరుకుంది. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ఈ 10ఖ రన్ ముఖ్య ఉద్దేశమని అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీటీసీ డీఎస్పీ దుర్గాప్రసాద్, సీఐలు లక్ష్మయ్య, వెంకటకృష్ణారెడ్డి, ఆర్ఐ నారాయణ, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి గారు, ఆర్ఎస్ఐలు, ట్రైనీ పోలీసులు, ఇతర పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# దొర్నిపాడు లో టిడిపికి షాక్

**☛ఇండిపెండెంట్ అభ్యర్థి భూమ బ్రహ్మానంద రెడ్డి కే నా మద్దతు**

**☛కో ఆప్షన్ నెంబర్ కానాల కాలే సాహెబ్**



దొర్నిపాడు 25 పల్లె వెలుగు న్యూస్ త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో భాగంగా దొర్నిపాడు మండలం కొత్తపల్లె గ్రామానికి చెందినమాజీమండలఅధ్యక్షుడుభూమాబ్రహ్మానందరెడ్డి నంద్యాల జిల్లా ఇండిపెండెంట్ జడ్పిటిసి అభ్యర్థిగఅదేవిధంగా7ఎంపిటిసి స్థానాల్లోనాలుగుఎంపీటీస్థానాలకు ఇండిపెండెంట్ అభ్యర్థులను పోటీ చేయించారు, భూమా బ్రహ్మానందరెడ్డి బలపరిచిన ఇండిపెండెంట్ అభ్యర్థులకు నా సంపూర్ణ మద్దతును ఇస్తానని దొర్నిపాడు మండలమాజీ కో ఆప్షన్ నెంబర్ ,ముస్లిం మైనార్టీ నాయకుడు కానాల కాలే సాహెబ్ అన్నారు, గత 30 సంవత్సరాలు నుండి భూమా కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కలిగిన కాలసాబ్ ముఖ్య అనుచరునిగా ఉంటూ రాబోయే ఎలక్షన్లో తన అనుచరులతోపాటుతన మద్దతును కూడా ప్రకటించారు నంద్యాల జిల్లా జడ్పిటిసి అభ్యర్థిగా భూమా బ్రహ్మం రెడ్డి భార్య విజయలక్ష్మి తో పాటు నాలుగు ఎంపీటీసీ స్థలాలను కైవసం చేసుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు

# గొర్రెల పెంపకదారుల సంఘం అధ్యక్షుడిగా దాట్ల జానకిరామ్ యాదవ్



బనగానపల్లె, అక్టోబర్ 25, పల్లెవెలుగు మండలంలోని యనకండ్ల గొర్రెల పెంపకదారుల సంఘం అధ్యక్షుడిగా దాట్ల జానకి రామ్ యాదవ్ ఉపాధ్యక్షులుగా బాణాల పెద్ద మస్తాన్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని యనకండ్ల గ్రామంలో గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం సమావేశం డాక్టర్ రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సమావేశంలో అధ్యక్షులుగా దాట్ల జానకిరామ్ యాదవ్ ,ఉపాధ్యక్షులుగా బాణాల పెద్ద మస్తాన్ యాదవ్, డైరెక్టర్లుగా బి. నాగసుబ్బయ్య యాదవ్ ,
పి. నాగసుబ్బయ్య యాదవ్ ,ఎం. వెంకటకృష్ణ యాదవ్, యు. అంకన్న యాదవ్ ,
ఎస్. బాల తిమ్మయ్య యాదవ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు బాణాల రామసుబ్బయ్య యాదవ్, పెండెకంటి శివరాముడు యాదవ్,మంటి వీరయ్య యాదవ్,దాట్ల. శ్రీరాములు యాదవ్, భూపనపాటి . గోపాల్ యాదవ్, బాణాల చిన్న హుసేని యాదవ్, బాణాల అంకన్న యాదవ్, పెండెకంటి సుబ్రహ్మణ్యం యాదవ్, సానం బాలసుబ్బయ్య యాదవ్,మంటి. రాము యాదవ్, మైల సాంబశివుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# యాగంటి దేవస్థానానికి భక్తుల విరాళం



బనగానపల్లె, అక్టోబర్ 25, పల్లెవెలుగు మండలంలోని యాగంటి శ్రీఉమామహేశ్వర స్వామి దేవస్థానానికి బెంగళూరు కు చెందిన దాసరి వీరవెంకట రమణ, ఆయన సతీమణి అనంతలక్ష్మి లు రూ.10,116 లు విరాళంను ఆలయ ఈఓ పాండురంగా రెడ్డి, చైర్మన్ బండి మౌళీశ్వర రెడ్డి లకు ఆదివారం అందజేశారు. దాతకు ప్రత్యేక పూజలు జరిపించి వారికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, అందజేశారు.

# ఘనంగా డాక్టర్ గురు రాజా జన్మదిన వేడుకలు

బనగానపల్లె అక్టోబర్ 25, పల్లెవెలుగు తెలుగుదేశం పార్టీ గ్లోబల్ ఎన్నారై అధ్యక్షులు డాక్టర్



గురు రాజా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలో డాక్టర్ గురు రాజా మిత్ర బృందం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాండు రంగస్వామి దేవస్థానం,సాయిబాబా,అంకాలమ్మ, ఆంజనేయ స్వామి దేవస్థానాలలో డాక్టర్.గురు రాజా ,వారి కుటుంబము ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గురు రాజ మిత్రబృందం సభ్యులు గడ్డం రామకృష్ణారెడ్డి , సభ్యులు పాల్గొన్నారు

# 15వ వార్డులో కమలం గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి బాట వేయాలి.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. స్థానిక ఎన్నికల్లో 15వ వార్డులో ప్రాంతం ప్రజలు తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి బిజెపి అభ్యర్థి పబ్బతి వేణుగోపాల్ కమలం గుర్తుకు



ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపునిచ్చారు. ఆదివారం 15వ వార్డులోని పబ్బతి వేణుగోపాల్ స్వగృహం నుండి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు శ్రీశైలం దేవస్థానం సభ్యుడు బిజెపి సీనియర్ నాయకులు మేడా మురళీధర్ బిజెపి నాయకులు పసుపుల రవికుమార్ కసెట్టి చంద్ర చంద్రశేఖర్ తెలుగుదేశం జనసేన నాయకులు తరలి రాగా బిజెపి అభ్యర్థి పబ్బతి వేణుగోపాల్ సతీమణి అడ్వకేట్ గోంట్ల అపర్ణతో సరస్వతి నగర్ ప్రాంతంలో పర్యటించారు . ఈ సందర్భంగా అభివృద్ధి మాట్లాడుతూ పి ఏ వి గ్రూప్ స్థాపించి ఎంతోమందికి నంద్యాలలో ఉపాధినిస్తూ పబ్బతి వేణుగోపాల్ సేవలందిస్తున్నారని అన్నారు .15 వార్డులో పద్ధతి వేణుగోపాల్ వంటి మంచి అభ్యర్థిని పారిశ్రామికవేత్తను వార్డు ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. శ్రీశైలం దేవస్థానం సభ్యుడు బిజెపి సీనియర్ లీడర్ మేడ మురళీధర్ మాట్లాడుతూ పబ్బతి వేణుగోపాల్ పట్టణంలో తన సొంత డబ్బుతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినటువంటి వ్యక్తి అని అన్నారు. 15 వ వార్డు ప్రజలు ఇటువంటి మంచి మనిషికి గుర్తు కమలానికి ఓటు వేసి ఆదరించి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

# జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల అధికారులకు శిక్షణ



హోళగుంద పల్లె వెలుగు అక్టోబర్ : 25 మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల విధుల నిర్వహణకు పీవోలు, ఏపీవోలుగా నియమితులైన అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి మనోహర్, ఎంపీడీవో సయ్యద్ ఉమర్, తహసీల్దార్ లక్ష్మిరాజు పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్లుగా సుధారాణి, చిన్నప్ప రెడ్డి, కృష్ణానాయక్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధులు, ఎన్నికల నిబంధనలు, అధికారుల బాధ్యతలు, పోలింగ్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, తమకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# వైభవంగా శ్రీ చౌడేశ్వరి అమ్మవారి పల్లకి సేవ



బనగానపల్లె, అక్టోబర్ 25,పల్లెవెలుగు మండలం లోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు ఈ రోజు పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం అమ్మవారి మూల మూర్తికి విశేష పూజలు నిర్వహించినారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తి కి విశేష అలశీకరణ చేసి పల్లకీ సేవ మరియు సహస్ర దీపాలంకరణ సేవ అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగినది. ఇందులో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఆకుమల్ల ఎంపీటీసీ స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

- రాజకీయ కక్ష సాధింపు చర్యే
- అభ్యర్థి నూలి శ్రీనివాసులు ఆరోపణ








బనగానపల్లె, అక్టోబర్ 25,పల్లెవెలుగు సంజామల మండలం ఆకుమల్ల ఎంపీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన నూలి శ్రీనివాసులుకు ఎదురుదెబ్బ తగిలింది. శనివారం నిర్వహించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో భాగంగా ఆర్వో (రిటర్నింగ్ ఆఫీసర్) జనార్ధన్ రెడ్డి తన నామినేషన్‌ను ఉద్దేశపూర్వకంగా తిరస్కరించారని శ్రీనివాసులు ఆరోపించారు.
?అధికారి నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆదివారం ఆర్డీఓ కార్యాలయంలో ఆప్పీల్ చేసుకునేందుకు వెళ్లగా, అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి నూలి శ్రీనివాసులు మాట్లాడుతూ...కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అధికారులు కుట్రపూరితంగా ఉద్దేశపూర్వకంగా తన నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపించారు. స్థానిక నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారని మండిపడ్డారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఉద్దేశ పూర్వకంగా తిరస్కరించిన ఆర్ఓపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని అధికారులకు హెచ్చరించారు. చదువుకున్న వ్యక్తి రాజకీయాలలోకి వస్తే గ్రామం అభివృద్ధి చెందుతున్న ఆశతో నామినేషన్ వేశానని కానీ రాజకీయ ఒత్తిళ్లతో అధికారులే ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారని ఆరోపించారు. 23వ తేదీ నామినేషన్ వేయడానికి వెళ్లిన రోజు నుంచి అధికారులు సహకరించడం లేదని ఆయన గుర్తు చేశారు. ప్రజాస్వామ్యాన్ని అధికారులు కాపాడాలని స్వతంత్ర అభ్యర్థి శ్రీనివాసులు చేతులు జోడించి ప్రాధేయ పడుతున్నానని అన్నారు. ఎన్నికల జిల్లా అధికారి స్పందించి నా నామినేషన్ ఆమోదించాలని కోరారు.

**సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నామినేషన్ దాఖలు**

ఆకుమల్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆయన పేర్కొన్నారు. ఆకుమల్ల గ్రామంలో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఆ సమస్య మంత్రి దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం లభించ లేదని అందుకే స్థానిక సంస్థ ఎన్నికలలో ఆకుమల్ల ఎంపీటీసి స్థానానికి నామినేషన్ దాఖలు చేశానని శ్రీనివాసులు సూచించారు. చదువుకున్న వ్యక్తితో గ్రామ అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. యువతలో మార్పు వస్తేనే అభివృద్ధికి నాంది పలుకుతుందన్నారు.

# ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే సాఫీగా ఎన్నికలను నిర్వహించాలి

**మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి**

ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 25, పల్లె వెలుగు



ఆళ్లగడ్డ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే ప్రజాక్షేత్రంలోకి వచ్చి ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు సాఫీగా జరిపించాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం వైసీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాతూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిల ప్రియ నిన్నటి రోజున విలేకరుల సమావేశం నిర్వహించి తాము ఎదో ఎన్నికలలో ఓడిపోతామన్న భయంతో మున్సిపల్ ఎన్నికలలో నామినేషన్లు విత్ డ్రా చేసుకున్నట్లు మాట్లాటడం విడ్డురంగా ఉందన్నారు. ఎన్నికల నామినేషన్ల నాటి నుండి ఎమ్మెల్యే, ఆమె సోదరుడు ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడ్డారో ప్రజలు అందరికీ తెలుసన్నారు. ఎన్నికల నామినేషన్ల రోజున ఎమ్మెల్యే సోదరుడు తమ అభ్యర్థి నామినేషన్ వేసేందుకు వెళితే చేతిలోని నామినేషన్ పత్రాలను లాక్కొని చింపి వేశారని, ఆ రోజు రాత్రి మాపార్టీ అభ్యర్థులను బలపరిచిన వ్యక్తులను బెదిరించి కిడ్నాప్ ల పర్వానికి తెర లేపారన్నారు. అలాగే
పెద్ద చింతకుంట గ్రామంలో ఒక వ్యక్తి ఇంటిపైకి నల్లరంగు స్కార్పియో వాహనంలో వెళ్లి దౌర్జన్యం చేశారన్నారు.
వైసీపీ అభ్యర్థి నామినేషన్ పత్రంలో సంతకం చేశారన్న అక్కసుతో ఒక మీడియా మిత్రుని సైతం బెదిరింపులకు గురి చేశారన్నారు. అన్నిటికి తమవద్ద ఆధారాలు ఉన్నాయని,
ఈ ఘటనలు అన్నిటిపై తాము జిల్లా ఎస్పీ, కలెక్టర్ లకు పిర్యాదు చేయగా రెసివ్డ్ కాపీలు కూడా తనకు అందాయన్నారు.
కాగా ఇప్పటివరకు ఒక్క ఎఫ్. ఐ. ఆర్ కూడా నమోదు చేయలేదన్నారు. రానున్న ఎంపిటిసి, జడ్పీటీసీ ఎన్నికలలో అన్ని చోట్ల తమ అభ్యర్థులు పోటీలో ఉంటారన్నారు.
ఈ ఎన్నికలలో గెలుపు ఓటములను ప్రజలే నిర్ణయిస్తారని ఆయన తెలిపారు.

# రెండూ ఓట్లు సైకిల్ గుర్తుకే వేసి ఎంపీటీసీ, జడ్పీటీసీలను గెలిపించండి

- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





గోకవరం, అక్టోబర్ 25 పల్లె వెలుగు:- గోకవరం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. మండలంలోని గాదెలపాలెం, ఇటికాయలపల్లి గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాదెలపాలెం, ఇటికాయలపల్లి ఎంపీటీసీ అభ్యర్థిగా కూటమి పార్టీలు బలపరిచిన తెలుగుదేశం అభ్యర్థి గుర్తిత్తి త్రిమూర్తులుకు, అలాగే గోకవరం జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ టీనా కేర్లిన్ కు మీ పవిత్రమైన ఓటు ముద్రను సైకిల్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి ఎంపీటీసీ, జడ్పీటీసీలను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, రాబోయే రెండున్నర సంవత్సరాలలో గోకవరం మండలంలో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, గ్రామాలకు భారీగా నిధులు మంజూరు అవుతున్నాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, సాగునీటి పథకాలకు నిధులు కేటాయిస్తున్నామని, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని, పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఆళ్లగడ్డ మున్సిపల్ చైర్మన్ టీడీపీ కైవసం.

## మున్సిపల్ చైర్మన్ గా షేక్ అనీషా

ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 25 పల్లె వెలుగు ఆళ్లగడ్డ మున్సిపల్ చైర్మన్ గా షేక్ అనీషా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. అలాగే మొత్తం 32 వార్డులకు సంభందించి ఏకగ్రీవంగా ఎన్నికైన కౌన్సిల్ సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి. టీడీపీ అత్యధికంగా 22, వైసిపీ 8,జనసేన నుండి ఇద్దరు ఎంపిక అయినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు.

వార్డుల వారీగా కౌన్సిలర్లు వీరే!

ఆళ్లగడ్డ మున్సిపాలిటీకి సంబంధించి 1 వ వార్డు నల్లబోతుల అరుణ (జనసేన ), 2 వ వార్డు ఉమ్మడి లక్ష్మీ దేవి (టీడీపీ )

3 వార్డు కే గంగాధర్ (టిడిపి)

4 వార్డు బొల్లవరం సురేంద్ర పద్మనాభరెడ్డి (వైకాపా)

5 వార్డు ఎం ప్రవంతి టిడిపి

6 వార్డు సింగం భాగ్యలక్ష్మి ( వైకాపా)

7 వార్డు బత్తుల పద్మావతి (టిడిపి)

8 వార్డు ఎస్ సౌజన్య (వైకాపా)

9 వార్డు గుత్తి రవళి (వైకాపా)

10 వార్డు బండారు శివకుమార్ (టిడిపి)

11 వార్డు కాజా మహమ్మద్ సలాం (టిడిపి)

12 వార్డు జన్మదిన మోబినా (వైకాపా)

13 వార్డు కాటసాని వసంత (టిడిపి)

14 వార్డు చింతకుంట్ల డాక్టర్ రామగోపాల్ రెడ్డి (టిడిపి)

15 వార్డు సగిలి శ్రీనివాసరెడ్డి (టిడిపి)

16వ వార్డు సోముల విజయభాస్కర్ రెడ్డి (టిడిపి)

17 వార్డు చింతకుంట రాజశేఖర్ (టిడిపి)

18 వార్డు షేక్ హుస్సేన్ భాష (టిడిపి)

19 వార్డు ఎస్ బిబి (టిడిపి)

20 వార్డు జానా పుష్పలత (టిడిపి)

21 వార్డు మాదం మరియమ్మ (టిడిపి)

22 వార్డు డాలు రత్నమయ్య జనసేన

23 వార్డు పెనుగొండ గంగాదేవి (వైకాపా)

24 వార్డు కమ్మరి వరలక్ష్మి (టిడిపి)

25 వ వార్డు నూర్ అహ్మద్ కాజా (టిడిపి)

26వ వార్డు షేక్ అక్బర్ (వైకాపా)

27వ వార్డు భూపతి రాజేశ్వరి (టీడీపీ)

28 వార్డు టి రవి చంద్రారెడ్డి (టిడిపి)

29 వార్డు ఇంజేటి లక్ష్మీ ఈశ్వరమ్మ( వైకాపా)

30 వార్డు కందూరు పద్మావతమ్మ (టిడిపి)

31 వ వార్డు వేములపాటి చిన్న ఓబన్న (టిడిపి)

32 వ వార్డు లక్కు హిమబిందు (టిడిపి)




# మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న,,,,,

## ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి ....





ఎమ్మిగనూరు పల్లె వెలుగు అక్టోబర్25 ఎమ్మిగనూరు పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయ నాగేశ్వర్ రెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థి మాచాని సునీత , వార్డు కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 12వ వార్డు దాదా సాహెబ్ వార్డు, 8వ వార్డు బందే నవాజ్, 14వ వార్డు వాహిద్, 15వ వార్డు సోమలగూడూరు బాషా, 17వ వార్డు యు.కె. వీరేంద్ర వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను కలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలపై భారంగా మారిన చెత్త పన్ను, అమ్మఒడి పథకం అమలులోని లోపాలు తదితర అంశాలను ప్రజలకు వివరించారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్న ప్రయోజనాలను వివరించారు. ఎమ్మిగనూరు పట్టణ ప్రజల చిరకాల స్వప్నమైన రూ.157 కోట్లతో చేపడుతున్న 24 గంటల నిరంతర తాగునీటి ప్రాజెక్టు గురించి వివరిస్తూ, పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎమ్మిగనూరు అభివృద్ధి కొనసాగాలంటే సైకిల్ గుర్తుకు మీ మద్దతు అవసరం. మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థి మాచాని సునీత కి, మీ వార్డు కౌన్సిలర్ అభ్యర్థికి రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించండి" అని ఎమ్మెల్యే ప్రజలను కోరారు.

# అత్యధిక మెజార్టీతో సీపీఐ అభ్యర్థులను గెలిపించండి

## సీపీఐ జిల్లా కార్యదర్శి పి. మురళి



సూళ్లూరుపేట, అక్టోబర్ 25 పల్లె వెలుగు:- మున్సిపాలిటీ పరిధిలోని 12వ, 16వ వార్డుల్లో పోటీ చేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభ్యర్థులను కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి. మురళి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం మధ్యాహ్నం 16వ వార్డు మన్నారు పోలూరు, 12వ వార్డు వట్టర్పాలెం ప్రాంతాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 12వ వార్డు అభ్యర్థి టి. ఆదిలక్ష్మి, 16వ వార్డు అభ్యర్థి ఏ. బాలయ్యలను స్థానిక ప్రజలకు పరిచయం చేసి మద్దతు కోరారు. అనంతరం పి. మురళి మాట్లాడుతూ వార్డుల్లో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించడమే సీపీఐ అభ్యర్థుల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వట్టర్పాలెం, మన్నారు పోలూరులో ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులు, మురుగునీటి పారుదల, పారిశుధ్య లోపాలు, దెబ్బతిన్న రహదారులు, వీధి దీపాల సమస్యల పరిష్కారానికి తక్షణ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపల్ అధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలు, కార్మికులు, మహిళలు, సామాన్య ప్రజల పక్షాన నిరంతరం పోరాడే సీపీఐ అభ్యర్థులను గెలిపిస్తే కౌన్సిల్లో ప్రజల గొంతుకగా నిలబడి వార్డు అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తారని పేర్కొన్నారు. ఎన్నికల హామీలకే పరిమితం కాకుండా నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పనిచేసే టి. ఆదిలక్ష్మి, ఏ. బాలయ్యలకు తమ అమూల్యమైన ఓటు వేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సూళ్లూరుపేట నగర కార్యదర్శి ఆనంద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలయ్య, అశోక్, సుమతి, నజీనా తదితరులు పాల్గొన్నారు

# తుపాను ముప్పు పట్ల గోకవరం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు -- తహసీల్దార్ పి. రామకృష్ణ

గోకవరం, అక్టోబర్ 25 రానున్న తుపాను నేపథ్యంలో గోకవరం మండల ప్రజలందరూ తీవ్ర అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ పి. రామకృష్ణ సూచించారు. మంగళ, బుధవారాల్లో గంటకు వంద కిలోమీటర్లకు పైగా వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉండటంతో పాటు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని తహసీల్దార్ కార్యాలయంలో ఇరవై నాలుగు గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామ పంచాయతీల ద్వారా ప్రజలకు తుపాను పట్ల విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావం ఉన్న సమయంలో అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని తహసీల్దార్ సూచించారు. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండరాదని, విద్యుత్ తీగలకు అత్యంత దూరంగా ఉండాలని హెచ్చరించారు. బలహీనమైన ఇళ్లలో నివసిస్తున్న వారు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తుపాను పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మండల యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని తహసీల్దార్ పి.రామకృష్ణ పేర్కొన్నారు. తుపాను సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అత్యవసర సహాయం కోసం తహసీల్దార్ కార్యాలయంలోని తుపాను కంట్రోల్ రూమ్ నంబర్ 9491385060 లేదా తహసీల్దార్ నంబర్ 8008803194 లను నేరుగా సంప్రదించాలని కోరారు

# దేవరగట్టు నుంచి నేరణికి చేరుకున్న శ్రీశ్రీ మాళ సహిత మల్లేశ్వర స్వామి విగ్రహాలు

హోళగుంద పల్లె వెలుగు అక్టోబర్ : 25 దేవరగట్టు శ్రీశ్రీ మాళ మల్లేశ్వర స్వామి ఉత్సవాల



అనంతరం స్వామివారి విగ్రహ మూర్తులు దేవరగట్టు నుంచి నేరణికి గ్రామానికి చేరుకున్నాయి. స్వామివారి విగ్రహాలు గ్రామానికి చేరుకోవడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు.స్వామివారి రాకతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశ్రీ మాళ సహిత మల్లేశ్వర స్వామివారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

# జోరుగా వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి వీర్రాజు ప్రచారం



చాగల్లు, అక్టోబర్ 25పల్లె వెలుగు:- చాగల్లు ఎంపీటీసీ-4 స్థానానికి వైఎస్సార్సీపీ బలపరిచిన అభ్యర్థి, పార్టీ జిల్లా ఆర్టీఐ నాయకుడు ఇంటి వీర్రాజు ఎన్నికల ప్రచారం గ్రామ పరిధిలో జోరుగా సాగుతోంది. ఆదివారం ఆయన ఇంటింటికి తిరిగి ఓటర్లను కలుసుకుని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటి వీర్రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగనన్న తన పరిపాలనలో నవరత్నాలను పూర్తిగా అమలు చేశారని తెలిపారు. చెప్పినవే కాకుండా చెప్పనివి కూడా నెరవేర్చారని, అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందించారని పేర్కొన్నారు. దేశంలోనే అత్యధికంగా పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రశంసించారు. ప్రస్తుత చంద్రబాబు పరిపాలన మొదలై ముప్పై నెలలు కావస్తున్నా పేదవానికి ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ పరిపాలన అంతం కావాలంటే స్థానిక ఎన్నికలలో వైఎస్సార్సీపీకి సంబంధించిన చాగల్లు ఐదు ఎంపీటీసీ స్థానాలను కూడా భారీ మెజార్టీతో గెలిపించవలసిన బాధ్యత ప్రజలందరిపై ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు. చాగల్లు అభివృద్ధి కోసం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు

# జోరుగా మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముప్పిడి





కొవ్వూరు, అక్టోబర్ 25పల్లె వెలుగు:- పట్టణంలోని 19వ వార్డులో ఆదివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా జరిగింది. కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొని వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక ఓటర్లను నేరుగా కలుసుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థి కంఠమణి విజయలక్ష్మి, 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మారిశెట్టి స్నేహ సావేంద్రిలను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. పట్టణ అభివృద్ధే లక్ష్యంగా కూటమి అభ్యర్థులు పనిచేస్తారని ఆయన వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ టి.వి. రామారావు, మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థి కంఠమణి విజయలక్ష్మి, 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మారిశెట్టి స్నేహ సావేంద్రి చురుగ్గా పాల్గొన్నారు. వీరితో పాటు తెలుగుదేశం, జనసేన, బీజేపి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# ఎంపీటీసీ అభ్యర్థి సుర్ల అప్పారావు విస్తృత ప్రచారం

జగ్గంపేట, అక్టోబర్ 25 పల్లె వెలుగు:- ఇర్రిపాక గ్రామ ఎంపీటీసీ అభ్యర్థిగా కూటమి బలపరిచిన



టీడీపీ అభ్యర్థి సుర్ల అప్పారావు శనివారం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో బరిలో నిలిచిన ఆయన గ్రామస్తులను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా సుర్ల అప్పారావు మాట్లాడుతూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపిస్తే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో ఇర్రిపాకను అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఉన్న సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని స్పష్టం చేశారు. అలాగే జగ్గంపేట జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీను మణిబాబును కూడా సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఓటర్లు తమ రెండు ఓట్లను సైకిల్ గుర్తుకే వేసి తమను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ బస్వా చిన్న బాబు, టీడీపీ సీనియర్ నాయకులు పంతం సత్యనారాయణ, జ్యోతుల నాగబాబు, జ్యోతుల సత్యమూర్తి, పంతం తమ్మి రాజుబాబు, కొండ్రపు సూరిబాబు, కోనేటి వెంకటేశ్వరరావు, జ్యోతుల బాబ్జి, కూటమి నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## నవదుర్గ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిత్య అన్నదానం



తాళ్లపూడి, అక్టోబర్ 25 పల్లె వెలుగు వి.కె. అచ్యుతన్ అయ్యర్ ఆశీస్సులతో నిర్మితమైన శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దసరా నవరాత్రుల సందర్భంగా శ్రీ నవదుర్గ అమ్మవారి (కనకదుర్గమ్మ) దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో దీక్షాపరులైన అయ్యప్ప స్వాములకు ఈ భోజన ఏర్పాట్లు చేశారు. శబరిమల యాత్ర కోసం మండల, మకరవిలక్కు దీక్షలు చేపట్టే భక్తులకు, గురుస్వాములకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విజయదశమి రోజున ప్రారంభమైన ఈ భోజన వసతి కార్తీక మాసంలో నలభై ఒక్క రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామ పెద్దలు, ఇతర స్వాముల సహకారంతో ప్రతిరోజూ మధ్యాహ్న సమయంలో ఈ భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. దీక్షా ధారణ చేసి, ఇరుముడి కట్టుకుని యాత్రకు వెళ్లే స్వాములు అయ్యప్ప మహిమలు తెలుసుకుని మాల వేయడం జీవిత పరమార్ధంగా భావించాలని ఈ సందర్భంగా భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేదార్ గురుస్వామి మాట్లాడుతూ అన్నదాన భిక్ష ఏర్పాటు చేసిన నవదుర్గ ఆలయ కమిటీ సభ్యులు మరింత వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కనకదుర్గమ్మను స్మరించుకుంటూ, అయ్యప్ప స్వామిని ప్రార్ధించి వారు సమర్పించిన అన్నదాన భిక్షను ఆయన స్వీకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు, దీక్షాపరులకు స్వాగతం పలుకుతూ ఈ అద్భుతమైన సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు

## ఎంపీపీ అభ్యర్థిగా నామా నాగ శంకర రాణి ఖరారు



తాళ్లపూడి, అక్టోబర్ 25 పల్లె వెలుగునియోజకవర్గ పరిధిలోని తాళ్లపూడి మండల ఎంపీపీ అభ్యర్థిగా తాడిపూడి గ్రామానికి చెందిన నామా కొండబాబు సతీమణి నాగ శంకర రాణిని కూటమి నాయకులు ఎట్టకేలకు ఖరారు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి కూటమి అభ్యర్థి ఎంపికపై నెలకొన్న ఉత్కంఠకు పార్టీ అధిష్టానం తీసుకున్న ఈ నిర్ణయంతో తెరపడింది. ఎంపీపీ పదవి జనరల్ కేటగిరీకి రిజర్వ్ కావడంతో, మండలంలో జనరల్ కోటా కింద ఉన్న అన్నదేవరపేట, గజ్జరం, తాళ్లపూడి, పెద్దేవం ఎంపీటీసీ స్థానాల నుంచి ఎంపీపీ అభ్యర్థిని ఎంపిక చేయాలని నాయకులు భావించారు. ఈ నేపథ్యంలో ముందుగా నామన పరమేశ్వరరావు, కోటారు వెంకట్రావు పేర్లు ప్రముఖంగా తెరపైకి వచ్చాయి. అదేవిధంగా జనసేన పార్టీ తరఫున కల్లూరి సుబ్రహ్మణ్యం పేరు కూడా పరిశీలనలోకి వచ్చింది. అభ్యర్థి ఎంపికపై నాయకుల మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినప్పటికీ తొలుత ఎలాంటి స్పష్టత రాలేదు. చివరికి అనూహ్య పరిణామాల మధ్య జనరల్ మహిళలకు కేటాయించిన ఎంపీటీసీ స్థానాలను కూడా కూటమి నాయకులు ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకున్నారు. ముఖ్యంగా తాళ్లపూడి మండలంలో కాపు సామాజికవర్గ ప్రాధాన్యతను, రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని వ్యూహాత్మకంగా నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా తాడిపూడి జనరల్ మహిళా ఎంపీటీసీ స్థానం నుంచి పోటీ చేస్తున్న నాగ శంకర రాణిని ఎంపీపీ అభ్యర్థిగా ఎంపిక చేస్తూ కూటమి అధిష్టానం తుది నిర్ణయం ప్రకటించింది. ఈ ప్రకటనతో మండల రాజకీయాల్లో అభ్యర్థి ఎంపికపై నెలకొన్న సందిగ్ధత తొలగిపోయింది

## ఎంపీటీసీగా సైనం రామలక్ష్మి శ్రీను ఏకగ్రీవ ఎన్నిక

జగ్గంపేట, అక్టోబర్ 25 పల్లె వెలుగు జె కొత్తూరు గ్రామ ఎంపీటీసీగా కూటమి



బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సైనం రామలక్ష్మి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుపరిపాలన, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వం, జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆశీస్సులు, కృషితోనే ఈ ఏకగ్రీవం సాధ్యమైందని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీగా ఎన్నికైన సైనం రామలక్ష్మి శ్రీను మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న జె కొత్తూరు గ్రామ ప్రజలకు, మద్దతు తెలిపిన కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సహకారంతో, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆశీస్సులతో జె కొత్తూరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో ఆమె ఇదే గ్రామానికి ఉప సర్పంచ్‌గా సేవలు అందించారు. ఈ ఏకగ్రీవ ఎన్నికతో జె కొత్తూరులో కూటమి బలం మరోసారి రుజువైందని, గ్రామ ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన నమ్మకానికి ఇది నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. ఈ విజయోత్సవ సంబరాల్లో కూటమికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## వద్దిపర్రు గ్రామం తెలుగుదేశం మయం



వద్దిపర్రు, అక్టోబర్ 25 పల్లె వెలుగు వైసీపీ ని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన 25 కుటుంబాలు.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. వైసీపీ నుండి వీరవల్లి సుబ్రహ్మణ్యం వారి అనుచరులు 25 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.వారందరికీ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పసుపు కండువా కప్పి పార్టీలోకి ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యానందరావు గారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో, అభివృద్ధి, సంక్షేమ పాలనకు ఆకర్షితులై ప్రతి గ్రామం నుండి వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయన్నారు. వద్దిపర్రు గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యత ఉంటుందన్నారు

## మైనార్టీల సంక్షేమం.. అభివృద్ధికి ఆకర్షితులై టీడీపీలోకి ముస్లిం నాయకులు

- మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో వెలంపాలెం వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరిక

ద్రాక్షారామం, అక్టోబర్ 25 పల్లె వెలుగు రామచంద్రపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి చేరికల జోరు కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు మైనార్టీల సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యత, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు వైసీపీ శ్రేణులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఈ క్రమంలో రామచంద్రపురం రూరల్ మండలం వెలంపాలెం గ్రామానికి చెందిన 30 మంది వైసీపీ కార్యకర్తలు ఆదివారం ద్రాక్షారామంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యత, ప్రజల



అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి వాసంశెట్టి సుభాష్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు తమను ఎంతగానో ఆకర్షించాయని తెలిపారు. ఈ కారణంగానే తెలుగుదేశం పార్టీ పట్ల విశ్వాసంతో పార్టీలో చేరినట్లు వెల్లడించారు. యాకోబు, ఫాజిల్, జి. షాన్, రబ్బానీ తదితరుల ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లాలని, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టేకిమూడి సత్యనారాయణ, చిక్కాల దొరబాబు, ఎంపీటీసీ అభ్యర్థులు డాక్టర్ రాంబాబు, సంపత్ సత్యనారాయణ, అన్నం శ్రీరామ్,తెలుగుదేశం పార్టీ నాయకులు, ముస్లిం పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు

## రాజమండ్రి ప్రెస్ క్లబ్ బైలా సవరణకు మెజార్టీ సభ్యుల ఆమోదం

రాజమండ్రి, అక్టోబర్ 25 పల్లె వెలుగు స్థానిక




జాంపేటలోని పోలీస్ కన్వెన్షన్ హాల్లో ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ జనరల్ బాడీ సమావేశం అధ్యక్షుడు మోతాబాల విజయ సారధి అధ్యక్షతన జరిగింది. జనరల్ సెక్రెటరీ గంద్రోతు వేణుగోపాలస్వామి (గోపి) దీనిని లాంఛనంగా ప్రారంభించారు. వేదికపై వ్యవస్థాపక సీనియర్ పాత్రికేయులు కే. సైలేంద్ర, వి.వి.ఎస్. కృష్ణకుమార్, పెద్దాడ నవీన్, మాజీ గౌరవ అధ్యక్షుడు మండేలా శ్రీరామ్ మూర్తి, మాజీ అధ్యక్షులు కుడిపూడి పార్ధసారథి, టి.రామనారాయణ, కోశాధికారి శ్రీపాద పురుషోత్తం కుమార్, ఉపాధ్యక్షులు పి.ఎస్. గంగాధర్, కే. దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రెటరీలు ఎస్. కృపానందం, కే. వరప్రసాద్ ఆశీనులయ్యారు. కార్యవర్గ సభ్యులు కే. మధు, ఆకుల ఈశ్వర్, ఆర్.వి.వి. సత్యనారాయణ, పాత గొలుసుల చంటిబాబు, పాలపర్తి శ్రీనివాస్, గోపాలకృష్ణ, గరగ ప్రసాద్, క్రమశిక్షణ కమిటీ సభ్యులు జె. కళాధర్, లకంసాని బలరాం, దాసరి రాము పాల్గొన్నారు. ఈ ఏడాది మరణించిన ఇద్దరు జర్నలిస్టులకు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం నూతన కమిటీ మూడు నెలల అభివృద్ధిపై అధ్యక్షుడు విజయ సారధి నివేదిక సమర్పించారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సీఎం కాంపోనెంట్ నిధుల నుంచి పది లక్షలు కేటాయించినందుకు వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. బీజేపి నాయకుడు కంబాల శ్రీనివాస్ సహకారంతో జర్నలిస్టులకు పదిహేను లక్షల ప్రమాద బీమా, ప్రమాదాల బారిన పడిన, గుండె శస్త్రచికిత్సలు చేసుకున్న వారికి ప్రెస్ క్లబ్ ఆర్ధిక సాయం అందించామన్నారు. దయనీయ స్థితిలో ఉన్న ఇద్దరు సీనియర్లకు నెలవారీ ఆర్థిక సాయం ఇస్తున్నామన్నారు. డైనింగ్ హాల్లో వాల్ డైనింగ్ వుడ్ ఏర్పాటు, జనసేన నగర అధ్యక్షుడు వై. శ్రీను సహకారంతో డాక్యుమెంట్ల భద్రతకు ఐరన్ బీరువా, నూతన వెబ్ సైట్ రూపకల్పన, గుర్తింపు కార్డుల జారీ వివరించారు. మాజీ ఎంపీ జీ.వీ. హర్షకుమార్ కుమారుడు జీ.వీ. శ్రీరాజ్ సహకారంతో లక్ష విలువైన కాఫీ మిషన్, డైనింగ్ హాల్ గోడల ఆధునీకరణ చేపట్టామన్నారు. క్లబ్ ప్రతిష్టకు భంగం కలిగించే వారిపై చర్యలకు క్రమశిక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. తర్వాత సెక్రెటరీ గోపి అజెండా అంశాలను వినిపించారు. సీనియర్ పాత్రికేయులు పెద్దాడ నవీన్, కే. సైలేంద్ర, వి.వి.ఎస్. కృష్ణకుమార్, మండేలా శ్రీరామ్ మూర్తి, కుడిపూడి పార్ధసారథి, టి. రామనారాయణ బైలా సవరణ ఆవశ్యకతపై సూచనలు చేశారు. కోశాధికారి శ్రీపాద పురుషోత్తం కుమార్ డిపాజిట్లు, సేవింగ్ బ్యాలెన్స్, షాపుల బకాయిలను సభ దృష్టికి తెచ్చారు. బైలా సవరణపై ఇద్దరు సభ్యులు లేవనెత్తిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశానికి హాజరైన నూట ఇరవై మంది సభ్యులలో మెజార్టీ సభ్యులు బైలా సవరణ, తీర్మానాలకు ఆమోదం తెలుపుతూ సంతకాలు చేశారని కార్యవర్గం అధికారికంగా ప్రకటించింది

## కొవ్వూరు 26వ వార్డులో జోరుగా ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారం

కొవ్వూరు, అక్టోబర్ 25 పల్లె వెలుగు పురపాలక



ఎన్నికల ప్రచారంలో భాగంగా 26వ వార్డులో బిజెపి, టిడిపి, జనసేన కూటమి నాయకుల ప్రచారం అత్యంత జోరుగా సాగింది. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కంటమణి విజయలక్ష్మి, 26వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి పిక్కి నాగేంద్రకు మద్దతుగా కూటమి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టిడిపి నాయకులు కంటమణి రామకృష్ణ, పరిమి రాధాకృష్ణ, పొట్రు శ్రీనివాస్, కోడూరి లక్ష్మీ నారాయణ, పొట్రు మురళీ తదితర ముఖ్య నాయకులు వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి కొవ్వూరు పట్టణ అభివృద్ధి కోసం చైర్మన్‌గా కంటమణి విజయలక్ష్మిని, కౌన్సిలర్‌గా పిక్కి నాగేంద్రను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ అభ్యర్థి పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ ప్రస్తుత తరం, భవిష్యత్తు తరాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. వికసిత కొవ్వూరు లక్ష్య సాధన తమ ప్రధాన సంకల్పమని, అందుకోసం ఓటర్లందరూ బిజెపి, టిడిపి, జనసేన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం టిడిపి నాయకులు కంటమణి రామకృష్ణ మాట్లాడుతూ కొవ్వూరు సమగ్ర అభివృద్ధి కోసం ఓటర్లందరూ ఏకతాటిపై నిలబడి కూటమికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రచార కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు చెరుకూరి సాయి రామకృష్ణంరాజు, రాజాని శ్రీనివాస్, తాతిని సురేష్, పోలినాయుడు, మనోజ్ తదితరులు చురుగ్గా పాల్గొన్నారు

## సమస్యాత్మక సున్నితమైన ప్రాంతాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అయినవిల్లి, అక్టోబర్ 25 పల్లె వెలుగు సమస్యాత్మక సున్నితమైన ప్రాంతాలను ముందుగా గుర్తించి



అధికారులు అప్రమత్తం గా ఉండాలని జిల్లా ఎన్నికల పరిశీలకురాలు పి. ప్రశాంతి ఐఏఎస్ తెలియజేశారు. ఆదివారం అయినవిల్లి, అంబాజీపేట పి గన్నవరం రిటర్నింగ్ అధికారి (ఆర్.ఓ.) కార్యాలయాన్ని సందర్శించి, ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సన్నద్ధత, అధికారుల కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ముందస్తు ఏర్పాట్ల వివరాలను పరిశీలకురాలు తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిర్దేశించిన విధివిధానాలను తూచా తప్పకుండా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల పరిశీలకురాలు వెంట ఉద్యాన శాఖ జెడి బి రమణ, అయినవిల్లి తాసిల్దార్ విద్యాపతి, అంబాజీపేట తహసిల్దార్ చిన్నబాబు పి గన్నవరం తాసిల్దార్ శ్రీ పల్లవి డి ఎల్ డి వో లు,ఎంపీడీవోలు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి అన్నదాన పథకానికి విరాళం

ర్యాలి, అక్టోబర్ 25 పల్లె వెలుగుడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆత్రేపుర మండలం




ర్యాలీ గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ర్యాలి జగన్మోహిని కేశవ, గోపాల స్వామి ఆలయంలోని అన్నదాన పథకానికి కొవ్వూరు కు చెందిన వంజరపు సత్యనారాయణ, లలితకుమారి దంపతులు ఆదివారం రూ. 10,116 వి ం ా ళ ం గా సమర్పించారు. ముందుగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారికి విరాళం మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆశీర్వచన మండపంలో ఆలయ అధికారులు, అర్చకులు దాతలకు వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికారు. అనంతరం స్వామి వారి శేష వస్త్రంతో పాటు స్వామివార్ల చిత్రపటాన్ని అందజేసి దాతలను ఘనంగా సత్కరించారు

## ఫ్యాన్స్‌కు సారీ చెప్పిన విశ్వక్ సేన్..

# ఎందుకంటే?

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి సినిమా అప్‌డేట్‌తో కాదు. తన అభిమానులకు క్షమాపణలతో.. ప్రస్తుతం విశ్వక్ సేన్ తన కొత్త సినిమా 'కల్ట్' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ



సినిమాను ఆయనే స్వయంగా దర్శకత్వం వహించారు. గాయత్రి భరద్వాజ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే 'కల్ట్' సినిమా షూటింగ్ పూర్తయింది. అక్టోబర్ 30న ఈ మూవీ థియేటర్లలోకి రానుంది. రిలీజ్‌కు సమయం దగ్గర పడటంతో ప్రమోషన్స్ వేగం పెంచారు. ఇందులో భాగంగా విశ్వక్ సేన్ తన అభిమానులతో ప్రత్యేకంగా ఫొటో సెషన్ నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమం అనుకున్న విధంగా సాగలేదు. విశ్వక్‌ను కలిసేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఊహించిన దానికంటే ఎక్కువ మంది రావడంతో ఏర్పాట్లు సరిపోలేదు. అందరితో ఫొటోలు దిగేందుకు సమయం కూడా లేకుండా పోయింది. దీంతో చాలామంది అభిమానులు నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. ఈ ఘటన విశ్వక్ సేన్‌ను కూడా బాధించింది. దీంతో ఆయన స్వయంగా సోషల్ మీడియా ద్వారా స్పందించారు. అభిమానులకు హృదయపూర్వకంగా క్షమాపణలు చెప్పారు. "మనస్ఫూర్తిగా చెబుతున్నా.. నన్ను క్షమించండి" అంటూ తన భావాలను పంచుకున్నారు. అభిమానుల ప్రేమ ఊహించలేదు తన అభిమానుల నుంచి వచ్చిన స్పందన ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా ఉందని విశ్వక్ సేన్ తెలిపారు.

భారీగా అభిమానులు రావడంతో వారందరినీ మేనేజ్ చేయడం సాధ్యం కాలేదని చెప్పారు. సరైన ఏర్పాట్లు లేకపోవడం కూడా సమస్యగా మారిందన్నారు. కొంతమంది అభిమానులు చాలా సేపు ఓపిగ్గా ఎదురుచూశారు. అయినప్పటికీ విశ్వక్‌తో ఫొటో దిగే అవకాశం దక్కలేదు. చివరకు నిరాశతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయం తనను ఎంతగానో బాధించిందని హీరో చెప్పారు. 'ప్రతి ఒక్కరినీ కలవలేకపోయా' అభిమానులందరికీ అవకాశం కల్పించలేకపోయానని విశ్వక్ సేన్ విచారం వ్యక్తం చేశారు. పరిస్థితి ఒక దశలో క్రౌడ్ కంట్రోల్ చేయలేనంతగా మారిందని చెప్పారు. ఈ కారణంగా కొందరిని మాత్రమే కలవగలిగానని వివరించారు. అయితే ఈ ఘటనతో అభిమానులకు దూరంగా ఉండాలని ఆయన భావించలేదు. అందుకు బదులుగా మరోసారి ప్రత్యేక ఫొటో సెషన్ నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఈసారి మరింత పక్కా ఏర్పాట్లు చేస్తామని విశ్వక్ సేన్ తెలిపారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు. ఎలాంటి తోపులాటలు, ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. బిగ్ బాస్ హౌస్‌కు షాలిని గుడ్‌బై.. 7 వారాల రెమ్యునరేషన్ ఎంతో తెలిస్తే షాకే! ఫ్యాన్స్‌కు మరింత దగ్గరైన హీరో సాధారణంగా ఇలాంటి ఘటనలు జరిగితే హీరోలపై అభిమానుల్లో అసంతృప్తి వ్యక్తమవుతుంది. కానీ విశ్వక్ సేన్ మాత్రం ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకోలేదు. స్వయంగా స్పందించి క్షమాపణలు చెప్పారు. అంతేకాదు మరోసారి కలుస్తానని మాట ఇచ్చారు. తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమ, మద్దతుకు ఎప్పటికీ రుణపడి ఉంటానని విశ్వక్ సేన్ పేర్కొన్నారు. అభిమానుల మనోభావాలను గుర్తించి హీరో స్వయంగా క్షమాపణ చెప్పడంతో చాలామంది హ్యాపీగా ఫీలవుతున్నారు. ప్రస్తుతం విశ్వక్ సేన్ లేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరోవైపు 'కల్ట్' మూవీపై కూడా అంచనాలు పెరుగుతున్నాయి.

# బిగ్ బాస్ హౌస్‌కు షాలిని గుడ్‌బై..

## 7 వారాల రెమ్యునరేషన్ ఎంతో తెలిస్తే షాకే!

బిగ్ బాస్ తెలుగు సీజన్ 10లో ఏడో వారం అనూహ్య మలుపులతో సాగుతోంది. ఈ వారం డబుల్ ఎలిమినేషన్ ఉంటుందనే ప్రచారం మొదటి నుంచే ఆసక్తిని పెంచింది. 12 మంది కంటెస్టెంట్లు నామినేషన్స్‌లో ఉండటంతో ఉత్కంఠ మరింత పెరిగింది. ఆరో వారం ఎలిమినేషన్ లేకపోవడంతో ఈసారి ఇద్దరు బయటకు వెళ్లడం ఖాయమనే అంచనాలు కూడా వినిపించాయి. చివరకు అదే తరహాలో ఎలిమినేషన్ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. వైల్డ్ కార్డు ద్వారా హౌస్‌లోకి వచ్చిన దక్షి గుత్తికొండతో పాటు షాలిని కూడా ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు సమాచారం. మొదట దక్షి గుత్తికొండ ఎలిమినేషన్ ఏడో వారం మొదటి ఎలిమినేషన్‌లో దక్షి గుత్తికొండ బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. దక్షి ఐదో వారంలో వైల్డ్ కార్డు ద్వారా హౌస్‌లోకి అడుగుపెట్టింది. దీంతో ఆమెకు ఎక్కువ కాలం హౌస్‌లో ఉండే అవకాశం దక్కుతుందని ప్రేక్షకులు భావించారు. కానీ ఆమె ప్రయాణం ఊహించిన దానికంటే త్వరగానే ముగిసినట్లు సమాచారం. వైల్డ్ కార్డు కంటెస్టెంట్‌గా వచ్చిన దక్షికి హౌస్‌లో తన గేమ్‌ను చూపించడానికి ఎక్కువ సమయం దక్కలేదు. దీంతో నామినేషన్స్‌లో ఆమెకు ఆశించిన స్థాయిలో ఓట్లు రాలేదనే చర్చ జరుగుతోంది. చివరకు ఆమె ఏడో వారం ఎలిమినేషన్‌లో భాగంగా బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. షాలినికి మరో షాక్ ఇక రెండో ఎలిమినేషన్ మాత్రం మరింత ఆసక్తికరంగా మారింది. రోహిత్, రామకృష్ణ, షాలిని డేంజర్ జోన్‌లో ఉన్నట్లు సమాచారం. మరోవైపు ముఖేష్, త్రిగుణ్, దెబ్జానీ, అమన్, నీతూ గ్రీన్ జోన్‌లో ఉన్నారు. వీరిలో కొంతమంది కలిసి తీసుకున్న నిర్ణయం ఆధారంగా షాలిని ఎలిమినేట్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. షాలిని ఎలిమినేషన్‌లో మరో ట్విస్ట్ ఉంది. గతంలో ఆమెను ఎలిమినేట్ చేసినట్లే చేసి సీక్రెట్ రూమ్‌కు పంపించారు. ఆ తర్వాత తిరిగి హౌస్‌లోకి తీసుకొచ్చారు. సీక్రెట్ రూమ్ నుంచి వచ్చిన తర్వాత ఆమె గేమ్‌లో మార్పు వస్తుందని భావించినట్లు తెలుస్తోంది. కానీ పరిస్థితి పెద్దగా మారలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రోహిత్‌తో లవ్ ట్రాక్ హైలైట్ షాలిని హౌస్‌లో ఉన్న సమయంలో ఆమె గేమ్ కంటే రోహిత్‌తో నడిచిన ట్రాక్ ఎక్కువగా చర్చల్లో నిలిచింది. వీరిద్దరి మధ్య ఉన్న కెమిస్ట్రీ సోషల్ మీడియాలో కూడా వైరల్ అయింది. ప్రేక్షకుల్లో కొంతమంది ఈ జోడీని బాగా ఆదరించారు. అయితే మరోవైపు షాలిని గేమ్‌పై ఎక్కువగా దృష్టి పెట్టలేదనే విమర్శలు కూడా వచ్చాయి. టాస్కుల్లో తన




సత్తా చూపించడం కంటే రోహిత్‌తో ఉన్న ట్రాక్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందనే కామెంట్లు వినిపించాయి. సీక్రెట్ రూమ్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత కూడా తన గేమ్‌లో పెద్దగా మార్పు కనిపించలేదనే చర్చ సాగింది. దీంతో షాలినికి ఓటింగ్‌లో ఎదురుదెబ్బ తగిలిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. సుమ నా ప్రాణదాత.. ఆమె వల్లే ఇంకా బతికున్నా.. అల్లరి సుభాషిణి ఎమోషనల్ షాలిని రెమ్యునరేషన్ ఎంత? ఇక షాలిని ఎలిమినేషన్‌తో పాటు ఆమె రెమ్యునరేషన్ కూడా ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రచారం ప్రకారం షాలినికి వారానికి సుమారు రూ.75 వేల పారితోషికం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆ లెక్కన ఏడు వారాలకు ఆమెకు సుమారు రూ.5.25 లక్షలు అందినట్లు సమాచారం. దీంతో పాటుగా అగ్నిపరీక్ష కార్యక్రమం ద్వారా కూడా ఆమెకు పారితోషికం లభించినట్లు టాక్. ఆ మొత్తాన్ని సుమారు రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు చెబుతున్నారు. దీంతో మొత్తం కలిపి షాలిని దాదాపు రూ.6 లక్షల వరకు సంపాదించినట్లు సమాచారం. 40 ఏళ్ల తర్వాత తొలిసారి.. అభిమానులతో రజినీకాంత్ అలా.. దక్షి పారితోషికం కూడా మరోవైపు దక్షి గుత్తికొండ రెమ్యునరేషన్‌పై కూడా ఆసక్తి నెలకొంది. ఆమెకు వారానికి సుమారు రూ.2.5 లక్షల పారితోషికం లభించినట్లు తెలుస్తోంది. దక్షి సుమారు రెండు వారాల పాటు హౌస్‌లో కొనసాగిన నేపథ్యంలో ఆమెకు దాదాపు రూ.5 లక్షల వరకు రెమ్యునరేషన్ అందినట్లు సమాచారం. ఇలా ఏడో వారంలో ఇద్దరు కంటెస్టెంట్లు బయటకు రావడంతో పాటు వారి పారితోషిక వివరాలు కూడా సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.




# జైలర్ 2 బాక్సాఫీస్‌లో

## రజనీకాంత్ మార్క్.. 11 రోజు వసూళ్లు చూస్తే మైండ్ బ్లాంక్!

సూపర్‌స్టార్ రజనీకాంత్ స్టామినా చూపిస్తున్నారు. 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగిస్తోంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా విడుదలైన రోజు నుంచే భారీ వసూళ్లు అందుకుంటుంది. ముఖ్యంగా మొదటి వారంలో భారీ కలెక్షన్లు సాధించిన ఈ సినిమా.. రెండోవారం అడుగుపెట్టిన తర్వాత కూడా పూర్తిగా డౌన్ కాలేదు. వీకెండ్ రావడంతో మళ్లీ కలెక్షన్లు పెరిగాయి. ముఖ్యంగా రెండో శనివారం సినిమా వసూళ్లలో భారీ జంప్ కనిపించింది. మరి పదో రోజు 'జైలర్ 2' ఎంత వసూలు చేసింది? 11వ రోజు కలెక్షన్స్ ఎలా ఉండబోతున్నాయి? సినిమా రూ.400 కోట్ల మార్క్‌ను అందుకుంటుందా? ఇప్పుడు చూద్దాం. జైలర్ 2 మొదటి రోజే రూ.59.70 కోట్ల ఇండియా నెట్ కలెక్షన్స్ సాధించింది. రజనీకాంత్‌కు ఉన్న క్రేజ్‌తో పాటు సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ఓపెనింగ్ డే భారీ వసూలు అందుకుంటుంది. రెండో రోజు కలెక్షన్లు కొంత తగ్గి రూ.37.10 కోట్లకు చేరాయి. అయితే మూడో రోజు నుంచి సినిమా మళ్లీ పుంజుకుంది. మూడో రోజు రూ.47.25 కోట్ల నెట్ వసూళ్లు రాగా, నాలుగో రోజు రూ.55.85 కోట్లు వసూలు చేసింది. ఐదో రోజు కూడా 'జైలర్ 2' తన జోరును కొనసాగించింది. ఆ రోజు సినిమా రూ.42.35 కోట్ల ఇండియా నెట్ వసూళ్లు సాధించింది. ఆరో రోజు కూడా రూ.46.80 కోట్లతో భారీ వసూళ్లు రాబట్టింది. ఇక ఏడో రోజు కలెక్షన్స్ కాస్త తగ్గాయి. ఇలా మొదటి గురువారం కలెక్షన్లు రూ.28.15 కోట్లకు చేరాయి. దీంతో మొదటి వారం పూర్తయ్యే సమయానికి సినిమా ఇండియాలో సుమారు రూ.317.20 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. ఇలా మొదటి వారంలోనే రూ.300 కోట్ల మార్క్ క్రాస్ చేసింది. అల్లరి సుభాషిణి ఎమోషనల్ రెండో వారం కలెక్షన్లలో కొంత తగ్గుదల కనిపించింది. ఇక ఎనిమిదో రోజు సినిమా రూ.17.15 కోట్ల నెట్ వసూళ్లు అందుకుంది. తొమ్మిదో రోజైన శుక్రవారం కలెక్షన్లు మరింత తగ్గి రూ.14.50 కోట్లకు చేరాయి. అయితే శనివారం నుంచి పరిస్థితి ఒక్కసారిగా మారింది. ఇక రెండో శనివారం అంటే పదో రోజు 'జైలర్ 2' ఏకంగా రూ.24.15 కోట్ల ఇండియా నెట్ కలెక్షన్స్ సాధించింది. శుక్రవారం వచ్చిన రూ.14.50 కోట్లతో పోలిస్తే శనివారం కలెక్షన్లు దాదాపు 66.6 శాతం పెరిగాయి. వాస్తవానికి వీకెండ్ కావడంతో జైలర్ 2 ఆక్యుపెన్సీ పెరిగింది. ఇక పది రోజుల్లో 'జైలర్ 2' ఇండియా నెట్ కలెక్షన్స్ సుమారు రూ.373 కోట్లకు చేరుకున్నాయి. ఇండియా గ్రాస్ పరంగా సినిమా ఇప్పటికే రూ.436 కోట్లకు పైగా రాబట్టింది. ఇక ప్రపంచ వ్యాప్తంగా 10 రోజు దాదాపు రూ. 10 కోట్లు వసూలు చేసింది. దీంతో ఓవర్సీస్ కలెక్షన్స్ రూ. 229.50 కోట్లు అందుకుంది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా పదిరోజుల్లో రూ. 666.30 కోట్లు వసూలు చేసింది.! 11వ రోజు అంచనా కలెక్షన్స్ ఇక 11వ రోజు అంటే రెండో ఆదివారం 'జైలర్ 2'పై మరింత ఆసక్తి నెలకొంది. అడ్వాన్స్ బుకింగ్స్‌లోనే 6.34 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం.ట్రేడ్ వర్గాల లేటెస్ట్ డేటా ప్రకారం.. మధ్యాహ్నం వరకు రూ.11.31 కోట్ల గ్రాస్, దాదాపు రూ.9.58 కోట్ల నెట్ వసూళ్లు నమోదైనట్లు తెలుస్తోంది. అడ్వాన్స్ బుకింగ్స్, షోల సంఖ్య, రెండో శనివారం కలెక్షన్లను బట్టి చూస్తే.. 11వ రోజు సినిమా భారీగా వసూలు చేసే అవకాశం కనిపిస్తోంది. ట్రేడ్ అంచనాల ప్రకారం రెండో ఆదివారం 'జైలర్ 2' ఇండియాలో సుమారు రూ.25 కోట్ల నుంచి రూ.27 కోట్ల వరకు నెట్ కలెక్షన్స్ సాధించే అవకాశం ఉంది. ఈ ట్రెండ్ కాస్త పెరిగితే.. రూ.400 కోట్ల మార్క్‌ను దాటే అవకాశం ఉంటుంది. ఓవర్‌సీస్ మార్కెట్‌లోనూ 'జైలర్ 2'కు భారీ రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే విదేశీ మార్కెట్‌లో ఇప్పటికే $25 మిలియన్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాల అంచనాలు చెబుతున్నాయి. దీంతో గతంలో రజనీకాంత్ నటించిన 'జైలర్', 'లియో', '2.0' వంటి సినిమాల ఓవర్‌సీస్ వసూళ్లను అధిగమించిన ఘనతను సాధించినట్టు తెలుస్తోంది. ఇక తెలుగు రాష్ట్రాల్లో కూడా 'జైలర్ 2' మంచి వసూళ్లను రాబడుతోంది. 10 రోజుల్లోనే తెలుగు రాష్ట్రాల్లో సుమారు రూ.85 కోట్ల వసూళ్లు సాధించినట్లు తెలుస్తోంది. ఈ లెక్కలను చూస్తే ఇప్పటికే బ్రేక్ ఈవెన్ క్రాస్ చేసినట్టు తెలుస్తోంది. 11వ రోజు రూ.25-27 కోట్ల అంచనా నిజమైతే సినిమా రూ.400 కోట్ల ఇండియా నెట్ మార్క్‌ను అందుకోనుంది. వసూళ్లు కొనసాగితే సినిమా బాక్సాఫీస్ రన్ మరింత భారీగా మారే అవకాశం ఉంది. ప్రొడక్షన్ హౌస్‌లు, సోషల్ మీడియా అకౌంట్లు వెల్లడించిన వివరాల ఆధారంగా పొందుపరచడం జరిగింది. సినిమా బాక్సాఫీస్ కలెక్షన్లకు సంబంధించి వెల్లడించే రిపోర్టులకు ఫిల్మీబీట్ ఎలాంటి బాధ్యత వహించదు.

నటీనటులు: చైత్ర అచర్- సూర్యరాజ్ వీరబత్తిని- చరణ్ లక్కరాజు- ప్రీతి పగడాల- రమేష్ ఇందిర- శ్రీ వైష్ణవ్- శశాంక్ పాటిల్ తదితరులు




Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com